PRGI Reg No -"APTEL/26/A1193

నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 98, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 29 - మే - 2026 , వెల రూ.5/-

# తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అన్న చంద్రబాబు

## ఎన్టీఆర్ కు భారతరత్న... మహానాడులో ఏకగ్రీవ తీర్మానం

- ★ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని వ్యాఖ్య
- ★తొమ్మిది నెలల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎన్టీఆర్ కు తప్ప ఎవరికీ సాధ్యం కాలేదన్న చంద్రబాబు



అమరావతి: చరిత్ర ఉన్నంత వరకు తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని చెప్పారు. మహానాడులో చంద్రబాబు మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి, దేశానికి విశేష సేవలు అందించిన ఎన్టీఆర్ కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని మహానాడులో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో భాగంగానే మహిళలకు 33 శాతం సీట్ల ప్రకటనను నారా లోకేశ్ చేశారని చంద్రబాబు తెలిపారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది టీడీపీ సిద్ధాంతమని... ఎన్టీఆర్ ఇచ్చిన ఆ సిద్ధాంతం శాశ్వతంగా కొనసాగుతుందని చెప్పారు. పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎన్టీఆర్ కు తప్ప చరిత్రలో మరెవరికీ సాధ్యం కాలేదని అన్నారు. సినీ చరిత్రలో ఎన్టీఆర్ కు ప్రత్యామ్నాయం లేదని... ఆయన చేసిన పాత్రలు మళ్లీ చేయాలంటే ఆయనే మళ్లీ పుట్టాలని వ్యాఖ్యానించారు.



2లో

## ఎన్టీఆర్ కలలను సాకారం చేయడానికి కట్టుబడి ఉన్నాం: మోదీ

### చిత్ర పరిశ్రమకు ఎన్టీఆర్ అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి

ఢిల్లీ: విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత సీఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ నివాళి అర్పించారు. పేద, అణగారిన వర్గాలకు గౌరవం తీసుకురావడమే లక్ష్యంగా ఎన్టీఆర్ పని చేశారని కితాబునిచ్చారు. ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకితభావం పేదల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిందని అన్నారు. చిత్ర పరిశ్రమకు ఎన్టీఆర్ అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని మోదీ కొనియాడారు. ఎన్టీఆర్ జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పేదల కోసం ఎన్టీఆర్ కన్న కలలను సాకారం చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

### రాజ్యసభకు వెళ్లాలని హైకమాండ్ కోరింది...

## నేను వెళ్లనని చెప్పాను




కర్ణాటక్: కాంగ్రెస్ హైకమాండ్ తనకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసిందని, కానీ తాను దానిని సున్నితంగా తిరస్కరించానని కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సిద్దరామయ్య వెల్లడించారు. మిగతా 2 లో



## యువతకు అవకాశాల వెల్లువ.. నైపుణ్యాలతో సిద్ధంగా ఉండండి: జెన్-జీతో మంత్రి లోకేష్

- రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నామన్న మంత్రి లోకేష్
- అవకాశాలకు అనుగుణంగా యువతను నైపుణ్య వనరులుగా తీర్చిదిద్దుతాం
- సోషల్ మీడియాలోని ఫేక్ కంటెంట్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచన
- విజయానికి దగ్గరి దారులు లేవని, కష్టపడితేనే ఫలితం ఉంటుందన్నారు
- యువత రాజకీయాల్లోకి రావాలని, టీడీపీ అవకాశాలు కల్పిస్తుందని పిలుపు మిగతా 2 లో



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ.. మాజీ సీఎం, స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా.. ఆయన 23 అడుగుల విగ్రహాన్ని.. హైదరాబాద్.. అమీర్‌పేటలోని.. మైత్రీవనం దగ్గర ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొని.. విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎన్టీఆర్ అభిమానుల చిరకాల కోరికను తీర్చానని సీఎం అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమయంలో.. ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తానని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి.. నవీన్ యాదవ్ ఎమ్మెల్యే అయ్యారు. అందువల్ల ఆ హామీని ఇప్పుడు నెరవేర్చారు. ఎన్టీఆర్ అభిమానులకు ఇది ఎంతో ఆనందం కలిగించింది. మైత్రీవనం చౌరస్తాలో ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. అందువల్ల మైత్రీవనానికి వచ్చే వారందరికీ ఈ విగ్రహం కనిపిస్తుంది. తద్వారా వారంతా ఎన్టీఆర్ చేసిన సేవల్ని గుర్తుచేసుకుంటారు. ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.



2లో

## హింసాత్మక రాజకీయాలకు తెలంగాణలో స్థానం లేదు

- భారాస నాయకుల వ్యాఖ్యలు ప్రమాదకరం
- భారాస నాయకుల అసలు స్వరూపాన్ని బయట పెట్టింది
- "తెలంగాణ ప్రజల చెమటతో నిర్మించిన సింగరేణి లాంటి సంస్థలను కాలబెట్టండి అని చెప్పడమంటే ఆర్థిక వ్యవస్థపై దాడి చేయడమే
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



2లో

## తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం: మంత్రి ఉత్తమ్

- ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ 1 నాటికి కొనుగోళ్లు పూర్తి చేయాలి
- రానున్న నాలుగు రోజులూ యంత్రాంగమంతా అప్రమత్తంగా వ్యవహరించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి
- అవసరమైతే ప్రైవేట్ లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉపయోగించుకోవాలి

భువనగిరి: తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి

## తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఝలక్!



- ఆర్టీసీలో కార్మిక సంఘాలు, గుర్తింపు సంఘం ఎన్నికలు, ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం
- ఈ రెండు అంశాలపై ప్రజాస్వామ్యబద్ధంగా కార్మిక సంఘాలే చర్చించుకుని నిర్ణయం వెల్లడించాలి'

### ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం

## అన్న క్యాంటీన్లు నిర్వహిస్తోంది

- ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పవన్ కల్యాణ్ నివాళి

- ప్రజా పక్షం వహించిన గొప్ప నేత ఎన్టీఆర్ అని కొనియాడిన పవన్
- రూ.2కే కిలో బియ్యం పథకంతో పేదల ఆకలి తీర్చారని ప్రశంస
- ఆ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు నడుపుతోందని వెల్లడి



అమరావతి: దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా మిగతా 2 లో

### ఆ మాటకు మంత్రి పొంగులేటి

## కట్టుబడి ఉండాలి

- 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా?

- సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటే
- రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదు
- "ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం..



హైదరాబాద్: సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని మిగతా 2 లో

## జల వివాదాలు.. రాష్ట్రాలకు మోదీ కీలక సూచన

### ఈ విషయంలో కెన్-బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలి



2లో

ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష

ఢిల్లీ: అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు.

## గొడ్డలి పార్టీ అరాచకాల్ని ప్రజలకు పదేపదే చెప్పాలి

- రక్తచరిత్ర రాసే వాళ్లు.. స్వర్ణాంధ్ర ఎలా సాధిస్తారు?
- స్థానిక ఎన్నికల్లో గెలవకపోతే నాయకులకు నమస్కారం పెట్టేయడమే
- జెన్‌జీ, ఆల్ఫాకు.. ఆకాశమే హద్దుగా అవకాశాలు
- తెదేపా మహానాడులో చంద్రబాబు స్వాగతోపన్యాసం



అమరావతి: రక్తచరిత్ర రాసేవారు స్వర్ణాంధ్ర ఎలా సాధించగలరని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. వైకాపా పాలనలో రాష్ట్రాభివృద్ధిపై గొడ్డలివేటుతో జరిగిన నష్టాన్ని ప్రజలకు మళ్లీ మళ్లీ వివరించడంతోపాటు, ఆ పార్టీ నైజాన్ని ఎండగట్టాల్సిన బాధ్యత కార్యకర్తలు, నేతలదేనని సూచించారు. తెలుగుదేశంలో ఏ స్థాయి నాయకుడికైనా పార్టీయే ముఖ్యమని.. క్యాడర్, క్యాడర్, క్యాడర్ మిగతా 2 లో

# బీజేపీలో కీలక మార్పులు.. నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు

ఢిల్లీ: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానం పలు రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చేసింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, త్రిపుర రాష్ట్రాలకు కొత్త పార్టీ అధ్యక్షులను నియమిస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ కార్యదర్శి అరుణ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. తాజా మార్పుల ప్రకారం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాకు ఢిల్లీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. వీరేంద్ర సచ్‌దేవా స్థానంలో ఆయన ఈ పదవిని చేపట్టనున్నారు. హర్యానా బీజేపీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ అర్చనా గుప్తాను, పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సర్దార్ కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, త్రిపుర సారథిగా డాక్టర్ అభిషేక్ దేబ్రాయ్‌ను నియమించారు. నితిన్ నబిన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీలో జరిగిన తొలి పెద్ద పునర్వ్యవస్థీకరణ ఇదే కావడం గమనార్హం. ఈ నియామకాల్లో పంజాబ్ అధ్యక్షుడి ఎంపికకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్పు కీలకంగా మారింది. ప్రస్తుతం ఆప్ పాలనలో ఉన్న పంజాబ్‌లో కాంగ్రెస్ నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ రాజకీయ అవకాశాన్ని అందిపుచ్చుకుని కీలక శక్తిగా ఎదగాలని బీజేపీ భావిస్తోంది. ఈ కొత్త అధ్యక్షులు త్వరలోనే పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఇతర కేంద్ర నాయకులతో సమావేశం కానున్నారు. వీరి నేతృత్వంలో రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో కొత్త కార్యవర్గాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

# మహానాడు సంచలన రికార్డు సృష్టించింది నారా లోకేశ్

అమరావతి: తొలిసారి హైబ్రిడ్ మోడల్ లో నిర్వహిస్తున్న మహానాడు సంచలన రికార్డు సృష్టించిందని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మహానాడు కార్యక్రమాలకు 11 లక్షల మంది క్యాడర్ హాజరయ్యారని ఆయన వెల్లడించారు. ఈ-అటెండెన్స్ లో వీరంతా నమోదు చేయించుకున్నారని తెలిపారు. మహానాడులో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని లోకేశ్ అన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచే ఎప్పటికప్పుడు మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సిద్ధాంత పరంగానే తాము సంస్కరణలు తీసుకొస్తున్నామని... ఎన్నికల కోసం కాదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని వెల్లడించారు. జెన్ జీ యువత ఏం ఆశిస్తుందో ఆలోచించి దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ సిద్ధంగా ఉందని లోకేశ్ తెలిపారు. జగన్ మాదిరి తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోబోమని చెప్పారు. టీడీపీ ప్రజాస్వామ్యబద్ధంగానే ముందుకు సాగుతుందని అన్నారు. జగన్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల పేపర్లను లాక్కుని ఎలాంటి అరాచకాలకు పాల్పడ్డారో అందరం చూశామని చెప్పారు. డీఎస్సీపై జగన్ వేయించిన కేసులన్నింటినీ కోర్టు కొట్టివేసిందని తెలిపారు. జగన్ తన కుటుంబ చరిత్రను తానే తవ్వి తీయించారని లోకేశ్ ఎద్దేవా చేశారు. రాజారెడ్డి అరాచకాలు, బెరైటీస్ గనుల కోసం చేసిన హత్యలు అన్నింటినీ ప్రజలకు తెలియజేసిన ఘనత జగన్ దేనని అన్నారు.

# ఆ మాటకు మంత్రి పొంగులేటి కట్టుబడి ఉండాలి

హైదరాబాద్: సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. "ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్నిపడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలు.. కేంద్రానికి కొలీజియం సిఫార్సు

ఢిల్లీ: సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదుగురు న్యాయమూర్తుల నియామకానికి రంగం సిద్ధం అయింది. సర్వోన్నత న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కొలీజియం కసరత్తు చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం, నలుగురు సీనియర్ హైకోర్టు న్యాయమూర్తులను, ఒక సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ జాబితాలో పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీచంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్ దేవ, జమ్మూ కశ్మీర్ లడఖ్ సీజే జస్టిస్ అరుణ్ పల్లి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వి. మోహన ఉన్నారు. సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, న్యాయ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ నియామకాలు అత్యంత కీలకమని కొలీజియం తన సిఫార్సులో పేర్కొంది. కొలీజియం పంపిన ఈ జాబితాను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ పరిశీలించి, కేబినెట్ ఆమోదం కోసం పంపుతుంది. కేంద్ర కేబినెట్ ఆమోదం అనంతరం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేయగానే ఈ నియామకాలు ఖరారవుతాయి. ఆ తర్వాత నూతన న్యాయమూర్తులుగా వీరు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ నియామకాలతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెరిగి, కార్యకలాపాలు మరింత చురుగ్గా సాగే అవకాశం ఉంది.

# తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఝలక్!

హైదరాబాద్: 'ఆర్టీసీలో కార్మిక సంఘాలు, గుర్తింపు సంఘం ఎన్నికలు, ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం.. ఈ రెండు అంశాలపై ప్రణాళికాబద్ధంగా కార్మిక సంఘాలే చర్చించుకుని నిర్ణయం వెల్లడించాలి'.. మేడే రోజున ఆర్టీసీ కార్మిక సంఘాలతో జరిగిన భేటీలో ముఖ్యమంత్రి వారికి సూచించిన మాట ఇది. 'మాకు యూనియన్ ఎన్నికలు అవసరం లేదు, ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనమే ముఖ్యం, ఆ మేరకే ఆమోద లేఖ సమర్పించాలి' అని కార్మికులు ముక్త కంఠంతో డిమాండ్ చేయటంతో కార్మిక సంఘాల నేతలు ముందు విలీన ప్రక్రియే జరపాలని, జూన్ రెండు రాష్ట్రావతరణ దినోత్సవం రోజున అపాయింటెండ్ డేట్‌ను ప్రకటించాలని పేర్కొంటూ యూనియన్ల వారీగా ప్రభుత్వానికి లేఖలు సమర్పించారు. దీంతో జూన్ రెండున అపాయింటెడ్ డేట్‌పై ప్రభుత్వం నుంచి ప్రకటన వస్తుందని వెయ్యి కళ్లతో కార్మికులు ఎదురు చూస్తున్నారు. అయితే, బుధవారం కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొన్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, త్వరలో ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆ తర్వాతనే ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ ఉంటుందని ప్రకటించారు. ముఖ్యమంత్రి చేసిన సూచనల ప్రకారం తాము వెల్లడించిన అభిప్రాయానికి ఇది విరుద్ధంగా ఉండటంతో కార్మికులు కంగు తినాల్సి వచ్చింది. మొదట గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించి, ఎన్నికైన సంఘం ప్రతినిధులను.. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియ విధివిధానాలు రూపొందించేందుకు సిఫారసు చేసే అధ్యయన కమిటీలో అధికారులతోపాటు నియమించనున్నట్టు మంత్రి వెల్లడించారు.

### నేతల ఒత్తిడితోనే?

ముఖ్యమంత్రి సూచించటంతో, కార్మికుల ఆకాంక్షల మేరకు కార్మిక సంఘాల నేతలు విలీనమే కావాలంటూ ప్రభుత్వానికి లేఖలు సమర్పించారు. కానీ, లోపాయికారిగా మాత్రం యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని పలువురు నేతలు గట్టిగా ప్రయత్నించారు. యూనియన్లు లేకుంటే ప్రభుత్వం కార్మికులను పట్టించుకోదని, యూనియన్లు ఉండాల్సిందేనని కొందరు నేతలు మాట్లాడిన ఆడియో రికార్డులు ఆ సమయంలో వైరల్ అయ్యాయి. దీంతో యూనియన్లు కాదు, విలీనం కోసమే ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కార్మికులు సంఘాలకతీతంగా నేతలను డిమాండ్ చేశారు. కానీ, చివరకు కొందరు నేతల ఒత్తిడే ఫలించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రకటనను యూనియన్ల నేతలు ఖండించారు.

# ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు నిర్వహిస్తోంది: పవన్ కల్యాణ్

అమరావతి: దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా పక్షాన నిలిచిన గొప్ప నేత ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ఆయన ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం చారిత్రాత్మకమైనదని గుర్తుచేశారు. ఎన్టీఆర్ చూపిన అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'అన్న క్యాంటీన్ల'ను నిర్వహిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. పేదలకు అండగా నిలవాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నామని తన సందేశంలో స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

# జల వివాదాలు.. రాష్ట్రాలకు మోదీ కీలక సూచన

మొదటి పేజి తరువాయి

సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్-బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్- అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

# రాజ్యసభకు వెళ్లాలని హైకమాండ్ కోరింది... నేను వెళ్లనని చెప్పాను


మొదటి పేజి తరువాయి

తనకు జాతీయ రాజకీయాలపై ఏమాత్రం ఆసక్తి లేదని, ఎమ్మెల్యేగా కొనసాగుతానని తెలిపారు. భవిష్యత్తులోనూ రాష్ట్ర క్రియాశీల రాజకీయాల్లోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు, గురువారం మధ్యాహ్నం బెంగళూరులోని లోక్ భవన్‌లో సిద్దరామయ్య తన రాజీనామా లేఖ అందజేశారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వ్యక్తిగత పనులపై తన సొంత ఊరైన ఇండోర్‌లో ఉండటంతో, ఆయన అందుబాటులో లేరు. దీంతో గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ప్రభు శంకర్‌కు సిద్దరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ సమయంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఇతర కేబినెట్ సహచరులు ఆయన వెంట ఉన్నారు. రాజీనామా చేయడానికి ముందు సిద్దరామయ్య తన నివాసంలో కేబినెట్ మంత్రులకు అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా, కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాల మేరకు తాను సీఎం పదవి నుంచి వైదొలగుతున్నానని, తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడతారని మంత్రులకు తెలియజేశారు. తాను రాజీనామా లేఖను స్వీకరించానని, దీనిపై గవర్నర్ తుది నిర్ణయం తీసుకుని ఆమోదిస్తారని ప్రత్యేక కార్యదర్శి ప్రభు శంకర్ మీడియాకు తెలిపారు.

# తిరుగుబాటుదారులపై మమతా బెనర్జీ 'ఊసరవెల్లి' పేరుతో కవిత!

ఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత పోరు తీవ్రమవుతున్న వేళ ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ తనదైన శైలిలో స్పందించారు. పార్టీలోని అసమ్మతి నేతలను లక్ష్యంగా చేసుకుని 'ఊసరవెల్లి' అనే పేరుతో పదునైన కవిత రాసి తన ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఎన్నికల పరాజయం తర్వాత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీని టార్గెట్ చేస్తున్న తిరుగుబాటు నేతలకు ఈ కవిత ద్వారా ఆమె గట్టి హెచ్చరిక పంపారు. "ఆదాయ వనరుల కోసం ఊసరవెల్లి కంటే వేగంగా రంగులు మార్చేవారే అత్యంత ప్రమాదకరం" అంటూ ఆమె కవిత ప్రారంభమవుతుంది. తమ సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం గంటల్లోనే రంగులు, నైజం మార్చేస్తారని, పార్టీ కోసం రక్తం చిందించిన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని అమ్ముకుంటారని మమత ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నమ్మకద్రోహానికి పాల్పడేవారికి భవిష్యత్తులో తగిన శిక్ష తప్పదని ఆమె పరోక్షంగా హెచ్చరించారు. "రథ చక్రాలు కదిలినట్లే మీ చక్రాలూ కదులుతాయి. దీనికి తగిన ఫలితం అనుభవిస్తారు" అంటూ కవితలో తీవ్ర స్వరంతో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో పార్టీని వీడాలనుకునే వారు వెళ్లొచ్చని మమత స్పష్టం చేసినా.. అసమ్మతి చల్లారకపోవడంతో ఈ కవితాస్త్రం సంధించినట్లు తెలుస్తోంది. బుధవారం రాత్రి పోస్ట్ చేసిన ఈ కవిత ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# చంద్రుడి దక్షిణ ధ్రువంలో భూగర్భ మంచు.. చంద్రయాన్-2 గుర్తింపు!




ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అద్భుతమైన ఆవిష్కరణతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఏడేళ్ల క్రితం ప్రయోగించిన చంద్రయాన్-2 మిషన్‌లోని ఆర్బిటర్, చంద్రుని దక్షిణ ధ్రువంపై భారీగా భూగర్భ మంచు నిల్వలు ఉన్నట్లు బలమైన ఆధారాలను గుర్తించింది. ఈ ఆవిష్కరణ భవిష్యత్ అంతరిక్ష యాత్రల గతిని మార్చే కీలక పరిణామంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 2019లో చంద్రయాన్-2 ల్యాండర్ చంద్రుడిపై దిగడంలో విఫలమైనప్పటికీ, దాని ఆర్బిటర్ మాత్రం కక్ష్యలో తిరుగుతూ విలువైన సమాచారాన్ని పంపుతూనే ఉంది. తాజాగా, ఆర్బిటర్‌లోని 'డ్యుయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్' పంపిన డేటాను అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు విశ్లేషించారు. చంద్రుడిపై ఎన్నడూ సూర్యరశ్మి సోకని, అత్యంత శీతలంగా ఉండే శాశ్వత చీకటి ప్రాంతాల ఉపరితలం కింద ఈ మంచు నిల్వలు ఉన్నట్లు వారు నిర్ధారించారు. ముఖ్యంగా, ఫాస్టిని బేసిన్‌లోని ఒక బిలం కింద మంచు ఉనికికి బలమైన ఆధారాలు లభించాయని తెలిపారు. ఈ ఆవిష్కరణ అంతరిక్ష రేసులో వ్యూహాత్మకంగా భారత్‌కు గొప్ప ఆధిక్యాన్ని ఇచ్చింది. చంద్రుడిపై కనుగొన్న ఈ నీటి మంచును భవిష్యత్తులో తాగునీరుగా, శ్వాసకు అవసరమైన ఆక్సిజన్‌గా, రాకెట్లకు అవసరమైన హైడ్రోజన్ ఇంధనంగా మార్చుకోవచ్చు. దీనివల్ల భూమి నుంచి ఇంధనాన్ని మోసుకెళ్లే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం అమెరికా, చైనా వంటి దేశాలు చంద్రుని దక్షిణ ధ్రువంపై స్థావరాలు ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో, నీటి వనరులు ఎక్కడ ఉన్నాయో కచ్చితమైన సమాచారాన్ని అందించి భారత్ కీలక పాత్ర పోషించింది. చంద్రయాన్-3 విజయంతో పాటు, ఇప్పుడు చంద్రయాన్-2 అందించిన ఈ డేటా ప్రపంచ అంతరిక్ష సమాజానికి అత్యంత విలువైనదిగా మారింది.

# తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం

భువనగిరి: తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని కలెక్టర్ అనురాగ్ జయంతి వివరించారు. సమీక్షకు ముందు యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. రానున్న నాలుగు రోజులూ యంత్రాంగమంతా అప్రమత్తంగా వ్యవహరించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ప్రైవేట్ లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉపయోగించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ 1 నాటికి కొనుగోళ్లు పూర్తి చేయాలని చెప్పారు. ఎమ్మెల్యేలు కూడా దీనికి సహకరించాలని ఆయన సూచించారు. తమ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కనీవినీ ఎరుగని రీతిలో దిగుబడులు వచ్చాయని.. ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఉత్తమ్ తెలిపారు. ప్రతిపక్షాలు రాజకీయం చేయడానికి యాత్రలు చేపడుతున్నాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపా నాయకులు బస్సు యాత్రలు చేయడం కాదని.. దిల్లీ యాత్ర చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. వడ్లు అంటే తెలియని వారు వాటి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రైతులకు సంకెళ్లు వేసి నడిరోడ్డుపై తిప్పిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.

# హింసాత్మక రాజకీయాలకు తెలంగాణలో స్థానం లేదు

దిల్లీ: మిలిటెంట్ యాక్టివిటీ చేయండి.. సింగరేణి భవనాలు కాలబెట్టండి.. రైలు పట్టాలు కోసేయండి అంటూ భారాస నాయకుడొకరు బహిరంగ వేదిక నుంచి చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరమైనవని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజకీయాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడాల్సిందిపోయి యువతను హింస, విధ్వంసం, చట్ట వ్యతిరేక కార్యకలాపాల వైపు ప్రేరేపించడం.. భారాస నాయకుల అసలు స్వరూపాన్ని బయట పెట్టిందని ధ్వజమెత్తారు. ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "తెలంగాణ ప్రజల చెమటతో నిర్మించిన సింగరేణి లాంటి సంస్థలను కాలబెట్టండి అని చెప్పడమంటే ఆర్థిక వ్యవస్థపై దాడి చేయడమే. ముందు కాలబెట్టు... తర్వాత డబ్బులొస్తాయని వ్యాఖ్యలు చేసిన నాయకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజంలో హింస, భయాందోళనలు, అరాచక వాతావరణం సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందాలని భారాస ప్రయత్నిస్తోంది. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ కూడా ఇలాగే రెచ్చగొట్టే రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇలాంటి పార్టీల నుంచి అభివృద్ధి రాజకీయాలు ఆశించడం వృథా అని మరోసారి రుజువైంది. తెలంగాణలో హింసాత్మక రాజకీయాలకు తావులేదు. ప్రజలు ఇలాంటి బాధ్యతారాహిత్య నాయకులను, సమాజంలో అశాంతిని సృష్టించే పార్టీలను తిరస్కరించాలి" అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# అన్న క్యాంటీన్లను ఎత్తివేయొద్దని అసెంబ్లీ సాక్షిగా చెప్పినా జగన్ వినలేదు: అచ్చెన్నాయుడు

అమరావతి: వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు గుప్పించారు. మహానాడులో ఆయన మాట్లాడుతూ... జగన్ హయాంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని అన్నారు. ఏ రాష్ట్రానికైనా పరిశ్రమల ద్వారానే ఆదాయం, ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 24 నెలల కూటమి పాలనలో రాష్ట్రానికి రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. పేదలకు రూ. 5కే కడుపు నింపే అన్న క్యాంటీన్లను ఎత్తివేయొద్దని అసెంబ్లీ సాక్షిగా చెప్పినా.. ఆనాడు జగన్ వినిపించుకోలేదని అచ్చెన్న విమర్శించారు. అన్న క్యాంటీన్లను తొలగించారని దుయ్యబట్టారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకే జగన్ మూడు రాజధానులు అన్నారని విమర్శించారు. మూడు ప్రాంతాల్లోనూ ఎన్నికల్లో జగన్ కు ఎదురుదెబ్బ తగిలిందని ఎద్దేవా చేశారు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ఏపీలో ఎంతో అభివృద్ధి జరిగిందని... కానీ దాన్ని మనం చెప్పుకోలేదని అచ్చెన్న అన్నారు. అదే సమయంలో జగన్ చెప్పిన అబద్ధాలను ప్రజలు నమ్మడంతో 2019లో టీడీపీకి నష్టం జరిగిందని చెప్పారు. ఈసారి ప్రజలకు అలాంటి ఛాన్స్ ఇవ్వొద్దని... మన ప్రభుత్వం చేసిన మంచి పనులను, అభివృద్ధిని ప్రజలకు వివరించి వారిని చైతన్యపరచాలని అన్నారు. రాష్ట్రంలో మరోసారి వైసీపీ అధికారంలోకి రాకుండా పాతిపెడదామని చెప్పారు.

# ఆ పొలాలను కొనుగోలు చేసిన తర్వాతే విద్యుత్ టవర్లు వేయండి: పేర్ని నాని

అమరావతి: హై ఓల్టేజ్ విద్యుత్ లైన్ల కారణంగా తమ భూములకు విలువ పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తెలిపారు. మచిలీపట్నం సమీపంలోని కొత్తపూడి గ్రామంలో పోర్టు కోసం విద్యుత్ టవర్ల కోసం అధికారులు మార్కింగ్ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. ఈ రోజు ఆ గ్రామానికి వెళ్లిన పేర్ని నాని రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ... 1994-95లో కొత్తపూడి గ్రామంలోని దళిత, పేద కుటుంబాలకు ప్రభుత్వం పట్టాల రూపంలో భూమి ఇచ్చిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పట్టాలన్నింటినీ ఫ్రీ హోల్డ్ గా మార్చేశారని వెల్లడించారు. ఇప్పుడు పోర్టు అవసరాల కోసం ఆ పొలాల్లో హెవీ విద్యుత్ లైన్ టవర్లను వేయడానికి అధికారులు మార్కింగ్ వేశారని తెలిపారు. రైతులకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండానే మార్కింగ్ వేశారని విమర్శించారు. హై ఓల్టేజ్ విద్యుత్ టవర్ల కారణంగా తమ భూములకు విలువ తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. హై ఓల్టేజ్ విద్యుత్ టవర్లు వేయాలనుకుంటే... ఆ పొలాలను పూర్తిగా కొనుగోలు చేయాలని పేర్ని నాని అన్నారు. ఈ గ్రామ రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# గొడ్డలి పార్టీ అరాచకాల్ని ప్రజలకు పదేపదే చెప్పాలి

అమరావతి: రక్తచరిత్ర రాసేవారు స్వర్ణాంధ్ర ఎలా సాధించగలరని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. వైకాపా పాలనలో రాష్ట్రాభివృద్ధిపై గొడ్డలివేటుతో జరిగిన నష్టాన్ని ప్రజలకు మళ్లీ మళ్లీ వివరించడంతోపాటు, ఆ పార్టీ నైజాన్ని ఎండగట్టాల్సిన బాధ్యత కార్యకర్తలు, నేతలదేనని సూచించారు. తెలుగుదేశంలో ఏ స్థాయి నాయకుడికైనా పార్టీయే ముఖ్యమని.. క్యాడర్, క్యాడర్, క్యాడర్ అనే లక్ష్యంతోనే పనిచేయాలని స్పష్టం చేశారు. 'ఎమ్మెల్యేలు, ఎంపీలే నాయకులు కాదు.. బూత్‌స్థాయిలోని ప్రతి కార్యకర్తా నాయకుడే. మనం తయారు చేయాల్సింది అనుచరుల్ని కాదు.. నాయకుల్ని. కార్యకర్తల్ని గౌరవంగా చూసుకోవాలి. వారికి సముచిత స్థానం కల్పించాలి. ఎవరు విస్మరించినా ఉపేక్షించేది లేదు' అని తేల్చిచెప్పారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయం వేదికగా 1,875 క్లస్టర్లను అనుసంధానిస్తూ హైబ్రిడ్ విధానంలో రెండు రోజులపాటు నిర్వహించే మహానాడును బుధవారం ప్రారంభిస్తూ చంద్రబాబు స్వాగతోపన్యాసం చేశారు. విద్య, ఉద్యోగాలతోపాటు స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చామని.. మోదీ నాయకత్వంలో చట్టసభల్లోనూ మహిళలకు 33% రిజర్వేషన్లు సాధిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. కూటమి విజయంలో మహిళలదే కీలక పాత్రని, ఈ మహానాడును ఆడబిడ్డలకే అంకితం చేస్తున్నామని ప్రకటించారు.


# యువతకు అవకాశాల వెల్లువ.. నైపుణ్యాలతో సిద్ధంగా ఉండండి

: జెన్-జీతో మంత్రి లోకేష్

అమరావతి: యువత అంకితభావం, సమష్టి కృషి, త్యాగనిరతి వంటి గుణాలను అలవర్చుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు యువతను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మహానాడు సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో "జెన్-జీ" యువతతో ఆయన ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వ దార్శనికతను వివరించారు.

### క్లస్టర్ విధానంతో పారిశ్రామిక ప్రగతి

రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం క్లస్టర్ ఆధారిత విధానంతో ముందుకు సాగుతోందని లోకేష్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించామని, డేటా, ఐటీ, క్వాంటం టెక్నాలజీ, రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధన వనరుల వంటి రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీనివల్ల ఒకేచోట ప్రధాన పరిశ్రమలతో పాటు, వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లు ఏర్పాటవుతాయని, తద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకోసిస్టమ్) నిర్మితమవుతుందని అన్నారు. "రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి" అని ఆయన సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యప్రణాళికలో మార్పులు తెచ్చి, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందిస్తామన్నారు.ః



### సోషల్ మీడియా ఫేక్ కంటెంట్‌పై అప్రమత్తత అవసరం

సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే తప్పుడు సమాచారం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. డీఎస్సీ విషయంలో ప్రతిపక్ష నేత నిరాధార ఆరోపణలు చేసి లక్షలాది మంది యువతను ఆందోళనకు గురిచేశారని విమర్శించారు. "మేం పారదర్శకంగా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేశాం. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా, వాస్తవాలను సరిచూసుకోవాలి," అని ఆయన యువతకు హితవు పలికారు.

విజయానికి దగ్గరి దారులు లేవు

కష్టపడటం ఒక్కటే విజయానికి మార్గమని, దానికి దగ్గరి దారులు ఉండవని లోకేష్ తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. "నేను మా నాన్నగారితో పోటీ పడాలంటే ఆయన కంటే ఎక్కువ కష్టపడాలి. నా పాదయాత్రలో రోజూ పోరాటం ఎదుర్కొన్నాను. 2019లో ఓడిపోయినా భయపడలేదు, 2024లో 91 వేల మెజారిటీతో గెలిచాను. ఆ రోజు భయపడి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు" అని అన్నారు. పరీక్షల్లో విఫలమైతే ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని, ఒక్క ఓటమి జీవితాన్ని నిర్ధారించదని విద్యార్థులకు ధైర్యం చెప్పారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

యువత రాజకీయాల్లోకి రావాలని, తెలుగుదేశం పార్టీ వారికి సముచిత అవకాశాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. మహిళా సాధికారత ప్రతి ఇంటి నుంచే మొదలుకావాలని, వారికి 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ఏకైక అజెండా అని, పెద్ద పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు వేమూరి సాత్విక్, చరణ్ యాదవ్, సత్యసాయి పవన్ కుమార్, ఖ్యాతి వర్ధిని పాల్గొన్నారు.

# మధురఫలం మామిడి-ఉత్తరాంధ్ర లో తగ్గుతున్న దిగుబడి

విశాఖపట్నం, నేటి శుభోదయ ::: ఫలాల్లో రారాజు మామిడి. పోషక విలువలు గల ఈ ఫలం వేసవిలో ఓ వరం. ప్రకృతి ప్రసాదించిన ఈ అమృతాన్ని మితంగా ఆస్వాదిస్తే ఆరోగ్యపరంగా లాభాలెన్నో అయితే ఆ మామిడిని సాగు చేస్తున్న రైతులను మాత్రం కష్టాలు వెంటాడుతున్నాయి. నీటి ఎద్దడి, మంచు, గాలివానల వల్ల ప్రతీ సంవత్సరం దిగుబడి పడిపోతోంది. కాయ దిగుబడి తగ్గితే గిట్టుబాటు ధరలు పెరగాలి. కానీ వ్యాపారులు ధరలను నియంత్రిస్తుండటంతో నష్టాల భారం రైతులకు, అధిక ధరలు ప్రభావం , కొనుగోలుదారులపై పడుతోంది. ఉత్తరాంధ్రలోనూ రాను రాను మామిడి దిగుబడి తగ్గుతోంది. ఒకప్పుడు ఉత్తరాంధ్రలో మామిడి వ్యాపారం జోరుగా సాగేది. ఈ ప్రాంతంలో పండే మామిడి రకాలకు మంచి గిరాకీ ఉంది. అయితే ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడం, సంరక్షణ చర్యలు సరిగ్గా పాటించకపోవడం, అరుదైన రకాలు కాపాడేందుకు శాస్త్రీయ ప్రయత్నాలు జరగకపోవడం, భూములు విలువ పెరగడంతో మామిడి పంట పండించే స్థలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరగడంతో ఉత్తరాంధ్రలో మామిడి తోటలు తగ్గుతున్నాయి.



## రసాయనాల వినియోగంతో నాణ్యతకు గండి

మరోపక్క మాధుర్యాన్ని పంచి ఆరోగ్యాన్నిచ్చే మామిడి పండ్లు విషతుల్యమవుతున్నాయి. పక్వానికి వచ్చిన మామిడి కాయలను గడ్డిలో మగ్గ బెట్టాల్సిన వ్యాపారులు త్వరితగతిన సొమ్ము చేసుకోవడానికి రసాయనాలు వాడి కృత్రిమంగా మగ్గిస్తున్నారు. ఇలా మధురమైన మామిడి పండ్లను విషపూరితం చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించలేని జనం రోగాలను 'కొని' తెచ్చుకుంటున్నారు.



## - విశాఖలో మే 28 నుంచి 3వ మామిడి మేళా

ఆరోగ్యమే మహాభాగ్యం- అందరూ ఆరోగ్యంగా జీవించాలనే తలంపుతో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, విశాఖపట్నం వారు మామిడి రైతులు సహజ సిద్ధంగా పండించి ముగ్గించిన వివిధ రకాల జాతుల మామిడి పళ్ళను విశాఖ ప్రజలకు అందించాలని తద్వారా ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలనే తలంపుతో 3వ మామిడి మేళా మామిడి రైతులుతో మే నెల 28,29,30,31 తేదీలలో ఉదయం నుండి రాత్రి 8గంటల వరకూ విశాఖపట్నం లో , బీచ్ రోడ్, కామత్ హోటల్ ప్రక్కన, లాసన్స్ బే కాలనీ నందు మామిడి పళ్ళు, మామిడి ఉత్పత్తులు ప్రదర్శన, అమ్మకం నిర్వహించనున్నారు.ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్గానిక్ మామిడి రైతులకు చేయూతనివ్వాలని నిర్వాహకులు పిలుపునిస్తున్నారు.సీజన్లో ఉత్తమమైన, రుచికరమైన మామిడిపండ్లను ఆస్వాదించడం శ్రేయస్కరమని చెబుతున్నారు.

## కనుమరుగవుతున్న అరుదైన మామిడి రకాలు

ఉత్తరాంధ్రలో ప్రభుత్వ చేయూత ఇవ్వకపోవడం,సమన్వయ లోపంతో అరుదైన మామిడి పండ్ల రకాలలు కనుమరుగవుతున్నాయి. ఫిరంగి లడ్డువా, గుర్రం మామిడి, శ్వేతామృతం, మెట్టవలస పీచు, ఖల్లాల మామిడి, కొవ్వాడ మామిడి, నూర్జహాన్ మామిడి, రసామృతం లాంటి అనేక రకాలు ఎక్కడో అరుదుగా ఒకటి రెండు మామిడి మొక్కలు మిగిలి ఉన్నాయి.

## ఉత్తరాంధ్రలో అందుబాటులో ఉన్న మామిడి రకాలు

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన మామిడి రకాలు అందుబాటులో ఉన్నాయి.గత ఏడాది అంచనాల ప్రకారం సువర్ణ రేఖ, బంగినపల్లి, పెద్ద రసాలు, చిన్న రసాలు, చెరుకు రసాలు, తోతాపూరి, దసేరి, హిమాంప సందు, సుందరి అటు ఇటుగా కొంత మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం గ్రామాలకు విస్తరించడంతో మామిడి తోటలు తగ్గిపోతున్నాయి.

## - మామిడి దిగుబడిలో రెండో స్థానంలో ఆంధ్ర ప్రదేశ్




మామిడి పళ్ళు ఆరోగ్యానికి అమృతం. కానీ అవి తినే పద్ధతి తెలిస్తేనే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు చెప్తున్నారు. దానిలో దాదాపు 200 పైగా వివిధ రకాలు ఉన్నాయి. ఎంత అనారోగ్యం ఉన్నా మామిడి పండ్లు మితంగా తింటే ఆరోగ్య లాభాలు ఎన్నో. ఓ విధంగా పోషకాల నిధి మామిడిపండు అని చెప్తారు. ప్రపంచానికి ఎగుమతుల్లో దేశంలో ఆంధ్ర రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. దేశంలో మామిడి దిగుబడి 2024-25 మొత్తం ఉత్పత్తి 228.37 లక్షల టన్నులు. గత ఏడాదితో పోలిస్తే 4.39 లక్షల టన్నుల ఎక్కువ దిగుబడి నమోదు చేసుకుంది. ప్రపంచ మామిడి ఉత్పత్తుల్లో మన దేశం నుంచి 40శాతం వాటా ఆంధ్రప్రదేశ్ అందిస్తుంది. మొదటి స్థానంలో ఉత్తరప్రదేశ్ 45 లక్షల టన్నులు, రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ 38 లక్షల టన్నులు దిగుబడి సాధించగా మూడో స్థానంలో కర్ణాటక 20 లక్షల టన్నులు. తర్వాతి స్థానంలో బీహార్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాలు ఉంటాయి. ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్ నగర్ ను "మ్యాంగో బౌల్ ఆఫ్ ఇండియా" అంటారు. ఆంధ్రప్రదేశ్ లో బంగినపల్లి మామిడి పండు రకానికి జియో టాగ్ ఉంది. భారత దేశం నుంచి ఎక్కువగా యూఏఈ, సౌదీ అరేబియా, యూకే, ఖతార్, బంగ్లాదేశ్,అమెరికా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.మామిడి రకం ఆల్ఫాన్సో మహారాష్ట్ర నుంచి, దసేరి ఉత్తరప్రదేశ్ నుంచి, బంగినపల్లి, రసాలు ఆంధ్రప్రదేశ్ నుంచి, కేసరి గుజరాత్ నుంచి. ముఖ్యం గా తోతాపూరి అనే మామిడి రకం ఆంధ్ర,కర్ణాటక నుంచి ప్రాసెసింగ్ చేసి మ్యాంగో పల్ప్ ఎక్కువ ఎగుమతి చేస్తారు. రసాయనాలతో పండించే మామిడి రకాల కన్నా ఆర్గానిక్ మామిడికి మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం సబ్సిడీలు, ఎగుముతుల ప్రమోషన్ లాంటి కార్యక్రమాలు అవసరానికి, అవకాశానికి తగినంత లేదు. మనదేశంలో మామిడి ని సంరక్షించుకోవడంలో వెనుకబడిపోతున్న తరుణంలో విదేశీ మోజుతో ఏమాత్రం నాణ్యతలేని, అరోమా లేని మామిడి రకాలు ఇప్పటికే ప్రధాన నగరాల్లో దిగుమతి చేసుకోవడం దురదృష్టకరం.థాయిలాండ్, బంగ్లాదేశ్,మలేషియా తదితర దేశాల నుండి బ్లాక్ మ్యాజిక్, టామీ ఆక్స్, మెజిస్టిక్, మిటోజా, కేనెంట్, మియాబార్కు లాంటి మామిడి రకాలు విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి. నాణ్యమైన, పోషక విలువలు కలిగిన స్వదేశీ మామిడి రకాలకు విదేశాల్లో మంచి గిరాకీ ఉన్న నేపథ్యంలో వీటి పంట విస్తరణకు, గిట్టుబాటు ధర కల్పనకు, మార్కెట్ సదుపాయాల కల్పనకు పాలకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. నాణ్యతలేని విదేశీ మామిడి రకాలను అధిక ధరలకు కొంటున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కలిగించాలి. అప్పుడే పోషక విలువలు గల మామిడి ఫలాలు అందరికీ అందుతాయి. డా " యం. అర్. యన్. వర్మ. సీనియర్ జర్నలిస్ట్, విశాఖపట్నం.





# జీ.కే.వీధి మండల అభివృద్ధే ధ్యేయంగా మహానాడు తీర్మానం

### ఐదేళ్ల వైసీపీ పాలనలో జీ.కే.వీధి మండలానికి అభివృద్ధి శూన్యం

### మహానాడులో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర పరిశీలకురాలు కొణతల రత్నకుమారి



గూడెం కొత్త వీధి, నేటి శుభోదయ,మే 28:గూడెం కొత్తవీధి మండలంలోని కళ్యాణ మండపం వేదికగా టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరి కొండలరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు మరియు ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకురాలు కొణతల రత్నకుమారి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి కార్యకర్తను గుర్తు పెట్టుకుని ఆదుకుంటారని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల తెలుగు మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ పంచాయతీల పరిధిలోని వివిధ సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మండలానికి ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఈ మహానాడు ద్వారా గూడెం కొత్తవీధి మండల అభివృద్ధికి పునాదులు వేయాలని నాయకులు, కార్యకర్తలు తీర్మానించారు. మండల అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరి కొండలరావు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, క్లస్టర్ ఇన్‌చార్జిలు గంట నళిని, వడేలు పాండురాజు, చిటికెల రాము, పి.ఏ.సి.ఎస్ చైర్మన్ మొట్టడం నూకరాజు, మార్కెట్ డైరెక్టర్ మొట్టడం శరబన్నదొర, మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, మండల సీనియర్ నాయకులు ముక్కలి మహేష్, మొట్టడం రామకృష్ణ, ముక్కలి కళ్యాణి, కొర్ర బలరాం (ఎస్టీ సెల్), సిరిబాల బుజ్జిబాబు (మాజీ సర్పంచ్), మాతే కామరాజు, కించె భీమన్న, గెమ్మెల చంద్రరావు, దేశగిరి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# "స్వర్గీయ ఎన్టీఆర్ 103 వ జయంతి ఘనంగా నిర్వహించిన టిడిపి ఇంచార్జ్ వలవల బాబ్జి"



తాడేపల్లిగూడెం మే 28 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు 103వ జయంతి వేడుకలు నియోజకవర్గం లో ఉన్న అన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని సాటి చెప్పిన గొప్ప వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని ఆయన కొనియాడారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు పాలనాపరమైన ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారని అన్నారు. ప్రతి పేదవాడికి కూడు, గుడ్డ సామాజిక పెన్షన్లు, మహిళలకు ఆస్తిలో సగభాగము వాటా, పేదల ఆరోగ్య భద్రతకు కిలో రెండు రూపాయలకే బియ్యం వంటి ఎన్నో పథకాలను తీసుకొచ్చిన మహానుభావుడు స్వర్గీయ ఎన్టీ రామారావు అని అన్నారు. రాజకీయ నాయకుడిగా కాక సినీ రంగంలో నటుడుగా అందరూ హృదయాలను చరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన నటనకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారని ఆయన తెలిపారు.అనంతరం డిజిటల్ మహానాడు సందర్భంగా ( రెండవ రోజు) నియోజకవర్గంలో ని 11 క్లస్టర్లు సందర్శించి నాయకులు మరియు కార్యకర్తలతో మమైక్యమయ్యారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ పటేల్ పట్వారి వ్యవస్థకు చరమగీతం అని పేర్కొన్నారు. ఆయా వర్గాల్లోని ఎంతోమంది ప్రజాప్రతినిధులుగా ప్రస్తుతం కొనసాగుతున్నట్లు గుర్తు చేశారు. అన్న ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన కార్యక్రమాలను నేటికీ అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కస్టర్లలో పేదలకు పట్టలు పంపిణీ చేశారు.సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలను సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు పెంటపాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు రూరల్ అధ్యక్షులు పరిమి రవికుమార్ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు గంధం సతీష్, పసల కొండ, దాసరి అప్పన్న, చెప్పుల వాసు క్లస్టర్ యూనిట్ మరియు బూత్ ఇన్చార్జిలు నాయకులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖమ్మంలో యదేచ్ఛగా చీకటి రాజ్యం

### - రెచ్చిపోతున్న కబ్జాకోరులు, ఎన్ఎస్పీ కాలువపై యథేచ్ఛగా దొడ్డ దారిన నిర్మాణాలు

### - పట్టించుకోని అధికార యంత్రాంగం

ఖమ్మం, నేటి శుభోదయ :::ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ప్రధానంగా నాలుగు డివిజన్లలో భూకబ్జాదారులు యదేచ్ఛగా రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు స్థలాలు అనే భేదం లేకుండా కాలువలు, పార్కులతో పాటు కంటికి కనిపించిన ప్రతి ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకొనడం వారి నైజం. తాజాగా నగరంలోని గొల్లగూడెం రోడ్డు, మధురానగర్ రోడ్ నెంబర్ మూడు ప్రాంతంలో ఎన్ఎస్పీ కాలువ భూములను లక్ష్యంగా చేసుకుని, తప్పుడు పత్రాలతో యథేచ్ఛగా అక్రమ గృహ నిర్మాణాలు చేపట్టి అమ్మకాలు చేపడుతున్న తీరు స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. ఒక వ్యక్తి ఎలాంటి మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు లేకుండా అక్రమంగా మూడు ఇండ్లను నిర్మించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వస్తోంది. ఈ మూడు ఇండ్లకు ఏకంగా యాభై నుండి అరవై వేల రూపాయలు అద్దెలు వస్తున్నట్లు స్థానికులు చెప్పడం కొసమెరుపు. కానీ అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది.

## - తప్పుడు పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లు

ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 59 జీవో ఇప్పుడు కబ్జాకోరులకు వరంగా మారింది. ఈ జీవోను ఆసరాగా చేసుకుని పక్కనే ఉన్న ఖాళీ ప్లాట్లకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు.59 జీవోలో క్రమబద్ధీకరించిన 150 గజాల స్థలం డాక్యుమెంట్లను అడ్డం పెట్టుకుని, ఇద్దరు వ్యక్తులు వందల గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారు.ఈ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తీరు మరింత వివాదాస్పదంగా మారింది. 1982 సంవత్సరంలో భూములు అమ్ముకున్న యాజమానుల కుటుంబ సభ్యుల సంతకాలతో, ఎలాంటి లింక్ డాక్యుమెంట్లు లేకపోయినా వందల గజాల ప్రభుత్వ స్థలాన్ని ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం విమర్శలకు దారి తీస్తోంది. కనీస ఆధారాలు, సరైన పత్రాలు లేకుండా ఏ విధంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారో అర్థంకాక స్థానికులు తలపట్టు కుంటున్నారు. ఈ తప్పుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఒక బ్యాంక్ ఉద్యోగి చేసిన సంతకాలు చర్చకు దారితీస్తోంది.

## - మీకు ఏమి కావాలి మీరు ఏమి కోరుకుంటున్నారు

ఎన్ఎస్పీ కాలువ భూములను అడ్డగోలుగా ఆక్రమించి వందల గజాల్లో ఇండ్లు నిర్మిస్తున్నా ఖమ్మం కార్పొరేషన్ అధికారులు చూసీచూడనట్లు గా వ్యవహరిస్తున్నారు. ఈ అక్రమ గృహాలకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. కనీసం ఇంటి నెంబర్లు కూడా కేటాయించలేదు. ఈ తప్పుడు డాక్యుమెంట్లతో నిర్మిస్తున్న కట్టడాలకు టౌన్ ప్లానింగ్, కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు ఏ విధంగా సహకరిస్తున్నారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. అక్రమాలపై స్థానికులు ఫిర్యాదు చేస్తే, కబ్జాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు "మీకు ఏమి కావాలి మీరు ఏమి కోరుకుంటున్నారు" అని ఫిర్యాదుదారులనే బేరసారాలకు గురిచేస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్ర, అవినీతిపై స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

## - మున్సిపల్ పార్కుకు కేటాయించిన స్థలంపై కన్నేసిన అధికార పార్టీ నాయకుడు

ఒకవైపు అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతుండగా, మరోవైపు అధికార పార్టీ నాయకుల అండదండలతో కబ్జాల పర్వం మరింతగా ముదిరింది. ఏకంగా మున్సిపల్ పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని కూడా వదలడం లేదు. మున్సిపల్ పార్కు నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి వర్క్ ఆర్డర్ తీసుకుని వచ్చిన ఒక కాంట్రాక్టర్‌పై, ఓ అధికార పార్టీ నాయకుడు ఓ కీలక అధికార పార్టీ నాయకుడి ద్వారా ఇటు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై అటు కాంట్రాక్టరుపై తీవ్ర ఒత్తిడి తెచ్చి ఎట్టకేలకు పార్కు నిర్మాణాన్ని అడ్డుకోవడమే కాకుండా, రాత్రికి రాత్రే ఆ స్థలం చుట్టూ ప్రహరీగోడ నిర్మించడం జరిగింది. ఈ మొత్తం భూకబ్జాల వ్యవహారంలో అధికార పార్టీ నాయకుల ప్రత్యక్ష ప్రమేయం ఉండటం, వారికి రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వత్తాసు పలుకు తుండటంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి ఈ అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని, కబ్జాదారులతో పాటు వారికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ, ఎన్ఎస్పీ భూములను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# బాపట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు గారి ఆధ్వర్యంలో ఘనంగా 'డిజిటల్ మహానాడు'



బాపట్ల నేటి శుభోదయమే 28 :బాపట్ల నియోజకవర్గంలో డిజిటల్ మహానాడు కార్యక్రమాలు రెండో రోజు కూడా వైభవంగా జరిగాయి. బాపట్ల పట్టణంలోని 'వి కన్వెన్షన్ హాల్' తో పాటు బాపట్ల మండలం వెదుళ్ళపల్లి, కర్లపాలెం మండలం పెద గొల్లపాలెం గ్రామంలోని కళ్యాణ మండపం, మరియు కర్లపాలెం పెద్దింటమ్మ దేవాలయ వద్ద కళ్యాణ మండపంలోఈ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ డిజిటల్ మహానాడు కార్యక్రమాలలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో కలిసి మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా ప్రతి క్లస్టర్ పరిధిలోని ఐదుగురు చొప్పున తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత భోజన విరామ సమయంలో కార్యకర్తలకు ఎమ్మెల్యే స్వయంగా భోజనాలు వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు.



# మెరుగైన వైద్య సేవలు అందించి మహిళ ప్రాణం కాపాడిన బాపట్ల ఏరియా వైద్యశాల వైద్యులు



బాపట్ల నేటి శుభోదయమే 28:బాపట్ల కర్లపాలెం మండలంలో భార్య పై కత్తి తో దాడి చేసిన భర్త మేడ పై కత్తితో నరకడంతో మేడపై బలమైన గాయం బాపట్ల ఏరియా వైద్యాశాలకు తరలించిన బందువులు క్షతగాత్రురాలుకు తక్షణ వైద్య సహాయం అందించి ప్రాణం కాపాడిన బాపట్ల ఏరియా వైద్యశాల వైద్యులు వైద్యశాలకు తరలించిన తక్షణమే మెరుగైన చికిత్స అందించి మహిళా ప్రాణాలను కాపాడిన వైద్యులు. చిన్న గాయం అయితేనే బాపట్ల ఏరియా వైద్యశాల నుండి గుంటూరుకు తరలిస్తారన్న అపవాదును పక్కనపెట్టి చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన వైద్యులు.సుమారు 15కు పైగా కుట్లు వేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఐసీయూలో అబ్జర్వేషన్ లో ఉంచిన వైద్యులు వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలి బంధువులు.



# చీకట్లు తొలిగి.. వెలుగులు నిండాయి

### విద్యుత్ అధికారుల సత్వర స్పందనపై భావపూరి కాలనీవాసుల హర్షం!



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) మే 28:బాపట్ల పట్టణ పరిధిలోని 24వ వార్డు బావపూరి కాలనీ నివాసితులకు గత కొన్ని సంవత్సరాలుగా తీరని శాపంగా మారిన విద్యుత్ లో-వోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. కాలనీలోని ఓ ప్రముఖ ప్రైవేట్ పాఠశాల ఎదురు రోడ్డులో నివసిస్తున్న ప్రజలు చాలా కాలంగా తీవ్రమైన విద్యుత్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో భానుడి భగభగలకు తోడు, లో-వోల్టేజ్ కారణంగా ఇళ్లలో కనీసం ఫ్యాన్లు కూడా తిరగని పరిస్థితి నెలకొంది. లైట్లు సరిగ్గా వెలక్క, ఉక్కపోత మరియు చెమటలతో చిన్నపిల్లలు, వృద్ధులు రాత్రుళ్లు నిద్రలేక తీవ్రంగా విసుగుచెంది నరకయాతన అనుభవించారు. ప్రతి ఏటా ఎండ తీవ్రత పెరిగే కొద్దీ ఈ ఏరియాలోని ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి.ఈ ఏళ్ల నాటి సమస్యను ఎలాగైనా పరిష్కరించుకోవాలనే పట్టుదలతో కాలనీవాసులు అంతా ఒకటై, ముందుగా టౌన్ విద్యుత్ ఏఈ సాయి శ్రీనివాసరావు గారి దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. కాలనీవాసుల వినతిని స్వీకరించిన ఏఈ క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను గమనించి, సమస్యను పరిష్కరించే దిశగా వేగంగా అడుగులు వేశారు. ఇందులో భాగంగానే ఈ విషయాన్ని ఉన్నతాధికారులైన ఏడీఈ శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. అక్కడి నుండి సమస్య తీవ్రతను వివరిస్తూ బాపట్ల ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) భాస్కరరావు వద్దకు ఫైల్ చేరింది.మరోపక్క కాలనీవాసుల కష్టాలను, వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ తక్షణమే స్పందించారు. ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, ఈ లో-వోల్టేజ్ సమస్యను తక్షణమే పరిష్కరించి కాలనీ ప్రజలకు ఊరట కలిగించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాలు, సూచనల మేరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు మరింత వేగంగా కదిలారు. డీఈ భాస్కరరావు ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి, కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యంత తక్కువ కాల వ్యవధిలోనే సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. దీనికి అవసరమైన సాంకేతిక వనరులను కూడా సమకూర్చారు.డీఈ గారి ఆదేశాలు, ఏడీఈ శ్రీనివాసరావు నిరంతర పర్యవేక్షణ, సూచనల మేరకు.. టౌన్ ఏఈ సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగారు. లైన్‌మెన్ సాంబశివరావు,ఇతర సాంకేతిక సిబ్బంది అంతా కలిసి ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని, కాలనీలోని విద్యుత్ లైన్లను, వోల్టేజ్ లోపాలను క్షుణ్ణంగా పరిశీలించి అన్ని సాంకేతిక లోపాలను సరిదిద్దారు. కాలనీకి అవసరమైన పూర్తి వోల్టేజ్ సరఫరాను పునరుద్ధరించి, లో-వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా దూరం చేశారు.గత కొన్ని సంవత్సరాలుగా ఎంతోమంది ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా పరిష్కారానికి నోచుకోని ఈ సుదీర్ఘ లో-వోల్టేజ్ సమస్య, ప్రస్తుత అధికారుల సమన్వయం మరియు చొరవతో కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే పూర్తి స్థాయిలో పరిష్కారం కావడంతో బావపూరి కాలనీ ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇళ్లలో ఫ్యాన్లు తిరగడం, లైట్లు వెలగడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. తమ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన బాపట్ల ఎలక్ట్రికల్ డీఈ భాస్కరరావు , ఏడీఈ శ్రీనివాసరావు , ఏఈ సాయి శ్రీనివాసరావు , క్షేత్రస్థాయిలో శ్రమించిన లైన్‌మెన్ సాంబశివరావు లకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యుత్ అధికారుల సత్వర స్పందన మరియు అంకితభావంతో కూడిన పనితీరుపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# వైసీపీ అధినేతను కలిసిన నాథమునిరెడ్డి



పులిచెర్ల, మే 28,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచర్ల మండల వైసీపీ అధ్యక్షుడు నాదముని రెడ్డి గురువారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని జగన్ సూచించినట్లు సమాచారం. పులిచర్ల మండలంలో వైసీపీ కార్యక్రమాలను మరింత చురుకుగా నిర్వహిస్తామని నాథముని రెడ్డి తెలిపారు.

## బాపట్లలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహ పునరావిష్కరణ

**: పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ**





బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) మే 28 :బాపట్ల పట్టణంలోని గడియార స్తంభం (క్లాక్ టవర్) సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పునరావిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్ , బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుండ్ల కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు న్యాయవాది కళ్ళం హరినాథ్ రెడ్డి, ప్రముఖ నాయకులు చేపల సుబ్రహ్మణ్యం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు మరియు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు పునరుద్ధరణ పనుల షెడ్యూల్‌లో మార్పు

**-- వాతావరణ పరిస్థితి రీత్యా పనులు కొనసాగించలేమని =ఒదీ శాఖ లేఖ**

విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ఘాట్ రోడ్డు టోల్ గేట్ నుండి కొండపైకి ఘాట్ రోడ్డు పునరుద్ధరణ పనులను దేవాదాయ శాఖ, ఆర్ అండ్ బీ (=ఒదీ) విభాగం సంయుక్తంగా ఈ నెల 26 నుండి ప్రారంభించారు. ఈ పనులను జూన్ 12 నాటికి పూర్తి చేయాలని అనుకున్నారు.అయితే, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ పనుల షెడ్యూల్‌లో తాత్కాలిక మార్పులు చేస్తున్నట్లు ఆర్ అండ్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురువారం దేవస్థానం అధికారులకు లేఖ ద్వారా తెలియజేసారు.విజయవాడలో ప్రస్తుతం ఎండ తీవ్రత, వడగాల్పులు సాధారణం కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని, ఈ అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల క్షేత్రస్థాయిలో కార్మికులు పనులు చేయడం అత్యంత కష్టతరంగా మారిందని, ఇంతటి తీవ్రమైన వేడి వాతావరణంలో రోడ్డు రిపేర్ పనులు (బిటుమిన్/కెమికల్ మిక్సింగ్) చేపట్టడం సాంకేతికపరంగా సరైనది కాదని,ఈ ఎండల వల్ల రోడ్డుపై మరిన్ని పగుళ్లు వచ్చే ప్రమాదం ఉందని భావిస్తూ తాత్కాలికంగా రోడ్ రిపేర్ పనులు నిలిపి వేస్తున్నట్లు ఆర్ అండ్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేర్కొన్నారు.వాతావరణం సాధారణ స్థితికి వచ్చేంత వరకు శాశ్వత మరామత్తు పనుల షెడ్యూల్‌ను మార్చవలసిందిగా ఆర్ అండ్ బీ (=ఒదీ) సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవస్థాన ఈఓ ను కోరారు.ప్రస్తుతానికి రోడ్డు పనులు నిలిపివేసి, భక్తుల వాహనాల రాకపోకలకు వీలుగా రోడ్డును తాత్కాలికంగా పునరుద్ధరించడం జరుగుతుందని, ఎండ తీవ్రత తగ్గి, వాతావరణం అనుకూలించిన వెంటనే తిరిగి ఘాట్ రోడ్డు శాశ్వత ఆధునీకరణ పనుల పూర్తి షెడ్యూల్‌ను భక్తులకు ముందుగానే తెలియజేస్తామని ఈఓ తెలిపారు.నేటి ఉదయం నుండి దేవస్థానం ఘాట్ రోడ్ వైపు వాహనాలు యధావిధిగా అనుమతిస్తామని, భక్తులు, వాహనదారులు ఈ మార్పును గమనించి దేవస్థాన సిబ్బందికి సహకరించవలసిందిగా ఈఓ కోరారు.

# భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి



విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి క్షేత్రం భక్తులందరికి శ్రీ దుర్గామల్లేశ్వరుల దర్శనం సులభతరంగా పూర్తి అవ్వాలనే ధ్యేయంతో దేవాలయ సిబ్బంది క్యూ లైన్ల క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఆలయ ఈఓ వి.కె.శీనానాయక్ గురువారం ఉదయం నుండి శ్రీ కనకదుర్గానగర్ ప్రాంతాల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి,క్లోక్ రూమ్, చెప్పులు స్టాండ్ ప్రాంతాల్లో భక్తులతో మాట్లాడి, భక్తుల ఫీడ్ బాక్ తీసుకున్నారు.శ్రీ దుర్గాఘాట్ ప్రాంతంలో హాకర్లు అధిక ధరలు వసూలు చేస్తున్నారనే అంశం మీద తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.దుర్గాఘాట్ లో ఇటీవల ప్రారంభించిన మరుగుదొడ్లు పరిశుభ్రతతో నిర్వహణ చేయాలని ఆదేశించారు.ఘాట్ రోడ్ మూసి వేత వలన కనకదుర్గానగర్ వైపు భక్తుల రద్దీ ఉండటం, వాహనాల సంఖ్య పెరగటంతో ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు.ఆర్. టి. సి ఆధ్వర్యంలో దేవస్థానంకు త్రిప్పుతున్న బస్సులు ఈవో శీనా నాయక్ పరిశీలించారు.

# జూన్ 5 నుండి ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమంలో 'కృష్ణవేణి నదీ నవహారతులు' పునఃప్రారంభం



విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- సనాతన హిందూ ధర్మ ప్రచారం, టెంపుల్ టూరిజం అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం (ఫెర్రీ ఘాట్) వద్ద 'కృష్ణవేణి నదీ నవహారతులు' కార్యక్రమాన్ని పునఃప్రారంభించడానికి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం సర్వసిద్ధమౌతోంది.జూన్ 5వ తేదీ నుండి ఈ నవహారతుల కార్యక్రమాన్ని వైభవంగా పునఃప్రారంభించి, నిరంతరాయంగా నిర్వహించేందుకు దేవస్థానం తగు చర్యలు చేపట్టింది.పవిత్ర సంగమంలో నవహారతుల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా, ఘనంగా నిర్వహించడానికి కావలసిన తగు సూచనలను లిఖితపూర్వకంగా సమర్పించవలసిందిగా ఆలయ స్థానాచార్యులు, వైదిక కమిటీ వారిని ఈవో శీనా నాయక్ కార్యాలయ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

క్షేత్రస్థాయి పరిశీలన -- సమగ్ర నివేదిక: పవిత్ర సంగమం వద్ద హారతుల నిర్వహణకు అవసరమైన వివిధ ఏర్పాట్ల నిమిత్తం దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, దేవస్థానం సహాయ కమిషనర్, పౌర సంబంధాల అధికారి, వైదిక కమిటీతో కలిసి ఉమ్మడిగా క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని ఈవో ఆదేశించారు.క్షేత్రస్థాయిలో అన్ని వసతులను, ఏర్పాట్లను పరిశీలించి జూన్ 2 లోపు పూర్తి స్థాయి సమగ్ర నివేదికను సమర్పించవలసిందిగా సంబంధిత అధికారులందరికీ ఈవో తెలియజేసారు.పవిత్ర కృష్ణమ్మ తల్లికి ఇచ్చే ఈ నవహారతుల కార్యక్రమం భక్తులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేయాలని ఈవో శీనా నాయక్ అధికారులను ఆదేశించారు.

# కార్పొరేషన్ లో దివంగత నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు



విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఏ.రవీంద్రరావు గురువారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను సిబ్బందితో ఘనంగా నిర్వహించారు. నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానుభావులని, ఆయన ప్రజాసేవతో అపారమైన పేరు ప్రఖ్యాతులను సంతరించుకున్నారు. ఆయన నేతృత్వంలో రాష్ట్రానికి చేసిన సేవలను మనం ఎప్పటికీ మరిచిపోలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## 'స్వర్గీయ ఎన్టీఆర్ ఎన్నో చరిత్రలు సృష్టించడమే కాకుండా నేటికి ఈ 'మహానాడు' తో కొత్త రికార్డులను సాధిస్తుండం అద్భుతం..!!'

**- టిడిపి జిల్లా అధ్యక్షులు, రుడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి..- రాజానగరం నియోజకవర్గం 10 క్లస్టర్లలో వైభవంగా 'మహానాడు' వేడుకలు.. సీనియర్ కార్యకర్తలకు సన్మానాలు.**

కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);'స్వర్గీయ ఎన్టీఆర్ ఎన్నో చరిత్రలు సృష్టించడమే కాకుండా నేటికి ఈ 'మహానాడు'తో కొత్త రికార్డులను సాధిస్తుండం అద్భుతమ'ని టిడిపి జిల్లా అధ్యక్షులు, రుడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. ఆర్థికమాన్యం, ఇంధనం ఆదా లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన 2 రోజుల వర్చువల్ 'మహానాడు' పండుగకు 16 లక్షల మంది కి పైగా కార్యకర్తలు హాజరయి కొత్త రికార్డు, ట్రెండ్ సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలో 10 క్లస్టర్ల, కోరుకొండ మండలం 3 క్లస్టర్లలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాలు రెండు రోజులు అత్యంత వైభవంగా జరిగాయి. మండలంలోని బూరుగుపూడి, శ్రీరంగపట్నం, నరసాపురం గ్రామాల్లో బుధ,గురువారాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో మహానాడు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రూడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోరుకొండ మండల క్లస్టర్ ఇన్చార్జిలు అడపా వీరబాబు, దిడ్డి మాధవరావు, రొంగల శ్రీనివాసుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాపవరం గ్రామానికి చెందిన తెలగంశెట్టి శ్రీను రూ. 2 లక్షల 25 వేలు వ్యయంతో తయారు చేయించిన ఎన్టీ రామారావు విగ్రహాన్ని బూరుగుపూడి టీడీపీ కార్యాలయంలో బొడ్డు వెంకటరమణ చౌదరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. రెండు రోజులు ఈ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురువారం చివరి రోజును పురస్కరించుకుని నియోజకవర్గంలో సీనియర్ కార్యకర్తలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మూడు క్లస్టర్లలో జరిగిన ఈ కార్యక్రమాల్లో మార్కెట్ యార్డ్ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, కంటే కేశవరావు, కోర్పు నరేంద్ర కుమార్, దిడ్డి మాధవరావు, తెలగశీశెట్టి శ్రీను, దూది కాంతారావు, కంటే గణపతి, పెదపాటి భీమరాజు, కోర్పు రాజేష్, మారిన రాము, మారిన బుజ్జి, పడాల పండు, పీత శ్రీను, మాతా ప్రభు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జయంతి తెలుగు వారందరికీ పండుగ రోజు

**తొమ్మిది నెలల్లోనే పార్టీని అధికారంలోకి తెచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్: ఎంపీ కేశినేని చిన్ని**



విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- విజయవాడ గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఎన్టీఆర్ 103 వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ వేడుకకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ఎన్ని సంవత్సరాలైనా ఎన్టీఆర్ యుగపురుషుడేనని కేవలం 9 నెలల్లోనే పార్టీని స్థాపించి అధికారంలోకి తీసుకువచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించారని అన్నారు పటేల్ పట్వారి వ్యవస్థను రూపుమాపి సామాన్య ప్రజలకు న్యాయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని చిన్ని కొనియాడారు.కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని తగ్గించి జాతీయస్థాయిలో ఫ్రంట్ ను అధికారంలోకి తెచ్చిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు.ఎన్టీఆర్ ఆశయాల బాటలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీని అన్ని విధాలుగా ముందుకు నడిపిస్తూ అధికారంలోకి పార్టీని తీసుకువచ్చారని యువ నేత లోకేష్ సైతం పార్టీని అన్ని విధాలుగా ముందుండి నడిపిస్తూ పాత తరం నవతరం యువతరం అందరినీ సమన్వయం చేస్తూ నడిపిస్తున్నారని చిన్ని కొనియాడారు.త్వరలో వైసిపి చేపట్టబోయే వెన్నుపోటు కార్యక్రమాలపై మాజీ సీఎం జగన్ పై ఎంపీ చిన్ని కీలక వ్యాఖ్యలు చేశారు తల్లి చెల్లిని జగన్ వెన్నుపోటు పొడిచారని బాబాయిని గొడ్డలి పోటు పొడిచాడని అందుకే వైసిపి గొడ్డలి పార్టీ అని వెన్నుపోటు దారులంతా ఆ పార్టీలోనే ఉన్నారని తీవ్రంగా విమర్శించారు జగన్ కుటుంబ సభ్యులనే కాదు రాష్ట్ర ప్రజలందరినీ కూడా వెన్నుపోటు పొడిచారని అన్నారు.ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, నాగ వంశం కార్పొరేషన్ చైర్మన్ ఎరుపోతు రమణ, జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి గాంధీ, చెన్నుపాటి ఉషారాణి, నరసింహ చౌదరి, సొంగ సంజయ్ వర్మ సంతోష్ కుమార్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, ప్రేమనాథ్, కోనేరు కిషోర్, బంక నాగమణి, వ్యాస్, మాదిగని గురునాథం, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## వెటర్నరీ కాలనీలో నిర్వహించిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం

విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం నగర వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోందని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.గురువారం ఉదయం వెటర్నరీ కాలనీ పార్క్‌లో నిర్వహించిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో ఆయన పారిశుధ్య కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన విజయవాడ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాలు చురుకుగా పాల్గొని పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించడం అభినందనీయమని చంద్రశేఖర్ అన్నారు.పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, తడి-పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. నగర పరిశుభ్రతను కాపాడటంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 'స్వర్గీయ ఎన్టీఆర్ ఎన్నో చరిత్రలు సృష్టించడమే కాకుండా నేటికి ఈ 'మహానాడు' తో కొత్త రికార్డులను సాధిస్తుండం అద్భుతం..!!'

**- టిడిపి జిల్లా అధ్యక్షులు, రుడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);'స్వర్గీయ ఎన్టీఆర్ ఎన్నో చరిత్రలు సృష్టించడమే కాకుండా నేటికి ఈ 'మహానాడు'తో కొత్త రికార్డులను సాధిస్తుండం అద్భుతమ'ని టిడిపి జిల్లా అధ్యక్షులు, రుడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. ఆర్థికమాన్యం, ఇంధనం ఆదా లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన 2 రోజుల వర్చువల్ 'మహానాడు' పండుగకు 16 లక్షల మంది కి పైగా కార్యకర్తలు హాజరయి కొత్త రికార్డు, ట్రెండ్ సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలో 10 క్లస్టర్ల, కోరుకొండ మండలం 3 క్లస్టర్లలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాలు రెండు రోజులు అత్యంత వైభవంగా జరిగాయి. మండలంలోని బూరుగుపూడి, శ్రీరంగపట్నం, నరసాపురం గ్రామాల్లో బుధ,గురువారాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో మహానాడు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రూడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోరుకొండ మండల క్లస్టర్ ఇన్చార్జిలు అడపా వీరబాబు, దిడ్డి మాధవరావు, రొంగల శ్రీనివాసుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాపవరం గ్రామానికి చెందిన తెలగంశెట్టి శ్రీను రూ. 2 లక్షల 25 వేలు వ్యయంతో తయారు చేయించిన ఎన్టీ రామారావు విగ్రహాన్ని బూరుగుపూడి టీడీపీ కార్యాలయంలో బొడ్డు వెంకటరమణ చౌదరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. రెండు రోజులు ఈ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురువారం చివరి రోజును పురస్కరించుకుని నియోజకవర్గంలో సీనియర్ కార్యకర్తలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మూడు క్లస్టర్లలో జరిగిన ఈ కార్యక్రమాల్లో మార్కెట్ యార్డ్ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, కంటే కేశవరావు, కోర్పు నరేంద్ర కుమార్, దిడ్డి మాధవరావు, తెలగశీశెట్టి శ్రీను, దూది కాంతారావు, కంటే గణపతి, పెదపాటి భీమరాజు, కోర్పు రాజేష్, మారిన రాము, మారిన బుజ్జి, పడాల పండు, పీత శ్రీను, మాతా ప్రభు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు తేజానికి మహానాడులో ఘన నివాళి



పులిచెర్ల, మే 28,(నేటి శుభోదయ) :తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్ టి రామారావు సేవలను తరతరాలు గుర్తుంచుకుంటాయని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో గురువారం నిర్వహించిన మహానాడు రెండో రోజు కార్యక్రమాల్లో ఎన్టీఆర్ జయంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రసారమైన మహానాడు కార్యక్రమాలను ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమానికి అర్థం చెప్పిన మహానీయుడు ఎన్టీఆర్

**తెలుగు వారి గుండెచప్పుడు ఎన్టీఆర్**

**ఎన్టీఆర్ సర్కిల్‌లో వైభవంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు.పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె, గద్దె అనురాధ**





విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- సంక్షేమ పథకాలకు అర్థం చెప్పిన మహానీయుడు నందమూరి తారక రామారావు అని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ చెప్పారు. గురువారం ఉదయం తూర్పులోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపి కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ఎన్టీఆర్ జిల్లా టి.డి.పి అధ్యక్షులు గద్దె అనురాధ హజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో మహానాడును ఘనంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. హైబ్రీడ్ విధానంలో జరుగుతున్న ఈ మహానాడు సభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరి హాజరు శాతాన్ని చూస్తే గిన్నిస్ రికార్డు నమోదు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా రంగంలో, రాజకీయాల్లో ఎన్టీఆర్ చరిత్రత సృష్టంచారని చెప్పారు. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, అన్న ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి మరేన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని వివరించారు. తెలుగువాడి గుండె చప్పుడును ఎన్టీఆర్ ఢిల్లీ వరకు వినిపించారని కొనియాడారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా దేశచరిత్రలో సంక్షేమానికి కొత్త అర్థం చెప్పిన మహానీయుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని అమలు చేశారని, ఫించన్లు ఇచ్చే పథకానికి ఆయనే శ్రీకారం చుట్టారని, ఆ తర్వాతే మిగిలిన రాష్ట్రాల్లో ఈ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఇప్పటికీ అమలు చేస్తున్నారని వివరించారు. పార్టీ పెట్టే సమయంలో ఎన్టీఆర్ పెద్ద పెద్ద ప్రసంగాలు చెప్పకుండా కేవలం కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతోనే ఎన్టీఆర్ ఆ రోజుల్లో ప్రచారం చేశారని చెప్పారు. టీడీపీ కొన్ని సార్లు ఓడిపోయినా మళ్ళీ ఆ ఓటమిని మరిపించేలా గొప్ప స్థాయిలో విజయాలు సాధిస్తూ వస్తోందని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ జెండాను పట్టుకునేందుకు తామంతగా చాలా గర్వంగా భావిస్తామని చెప్పుకొచ్చారు. టిడిపిఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ ఇటు సినిమా, అటు రాజకీయాల్లో ఎన్టీఆర్ ప్రభంజనం సృష్టించారన్నారు. మంచి ఆశయాలు, సిద్ధాంతాలతో ఏ రంగంలోనైనా రాణించవచ్చునని ఎన్టీఆర్ నిరూపించి చూపించారని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తి హక్కులో సమానత్వం, ప్రత్యేకంగా మహిళా యూనివర్శిటీని ఎన్టీఆర్ స్థాపించారని చెప్పారు. ఎన్టీఆర్ రాజకీయ వారసుడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీని మరింతగా ప్రజలకు చేరువ చేస్తున్నారని, సంక్షేమ పథకాలను మరింత విస్తరిస్తున్నాని తెలిపారు. డ్వాక్రా వ్యవస్థను తీసుకువచ్చి మహిళలను ఆర్థికంగా మరింతగా బలోపేతం చేశారని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ప్రస్తుత మహానాడులో తీర్మానం చేశారని గద్దె అనురాధ తెలిపారు. ఈ కార్యక్రమములో బొప్పన భవకుమార్, చెన్నుపాటి గాంధి, కర్ణా రమేష్, ముమ్మనేని ప్రసాద్, గొట్టిముక్కల రఘు, సి.హెచ్.ఉషారాణి, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, నర్రా కిషోర్, పామర్తి కిషోర్, యర్నేని వేదవ్యాస్, నాదెళ్ల రాజేష్, గరికపాటి బద్రి, నూతి శ్రీను, రాధారపు యల్లబాబు, శివలక్ష్మి, మార్తా సూర్యకుమారి ఇంకా అనేక మంది నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## సెంట్రల్ నియోజకవర్గంలో బొండా ఉమా ఆధ్వర్యంలో

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరునామాగా, ప్రజల హృదయాల్లో చిరంజీవిగా నిలిచిపోయిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా సెంట్రల్ లో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో పండుగ వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన మహానాడు-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు బొండా ఉమా కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం పైపుల రోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు, ప్రతి డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులను బొండా ఉమా సన్మానించారు.గురువారం క్లస్టర్ 6, 8, 10, 11 ప్రాంతాల్లో నిర్వహించిన వర్చువల్ మహానాడు వేడుకలలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన క్రియాశీలక కార్యకర్తలను సన్మానించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ "తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఆ మహానుభావుడిని స్మరించుకుంటున్నాం, బడుగు, బలహీన వర్గాలు, బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు, మహిళల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయం. దేశంలో మొదటిసారిగా పింఛన్ పథకం, పక్కా ఇళ్లు, రూ.2 కిలో బియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి, యువతకు అవకాశాలు అందించిన మహానేత ఎన్టీఆర్ .ఆయన ఆశయాలనే ముందుకు తీసుకెళ్తూ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ పేదలు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోంది. ప్రస్తుతం రూ.4000 పింఛన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఎన్టీఆర్ ఆశయాలకు పునరంకితమవుతూ ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుంటాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ అబ్జర్వర్ బచ్చుల బోస్, క్లస్టర్ ఇన్‌చార్జులు నవనీతం సాంబశివరావు, తుమ్మలపెంట శ్రీనివాసులు, వల్లభనేని సతీష్, ఎస్ఎల్వి రాజు, సింగం వెంకన్న, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు భాష, సంస్కృతి, జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- తెలుగు భాష, సంస్కృతి, జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి అన్న ఎన్టీఆర్ అని మైలవరం ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ అభివర్ణించారు.తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ అన్న నందమూరి తారక రామారావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు.విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి వన్ సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటేందుకే అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తుచేశారు.పేదలకు కూడూ, గుడ్డ, నీడ అనే కనీస అవసరాలు తీర్చడమే ప్రధాన లక్ష్యంగా ఎన్టీఆర్ పార్టీని ప్రారంభించారని తెలిపారు.పేదలకు పింఛన్ పథకాన్ని దేశంలోనే మొట్ట మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఘనత అన్నగారిదేనని కొనియాడారు.అన్న ఎన్టీఆర్ ప్రారంభించిన పింఛను పథకం నేడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అమలవుతోందని గర్వంగా పేర్కొన్నారు.పేదల సంక్షేమ పథకాలకు దేశంలోనే తొలిసారిగా పునాదులు వేసిన మహనేత ఎన్టీ రామారావు అన్నారు.ఒక్క రూపాయికే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా ఇళ్ల నిర్మాణం వంటి విప్లవాత్మక పథకాలను అన్న తెచ్చారని గుర్తు చేశారు.ఆయన ఆశయాలను తూ.చ. తప్పకుండా నెరవేరుస్తామని, అదే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే వసంత తెలిపారు.సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగుతోందన్నారు.సూపర్ సిక్స్ హామీలు, పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు అన్న ఆశయాలకు నిదర్శనమని పేర్కొన్నారు.సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత ఎన్టీఆర్ దేనన్నారు.మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి మహిళా సాధికారతకు బాటలు వేసింది అన్నగారేనని కొనియాడారు."జై తెలుగుదేశం, జై చంద్రబాబు, జై లోకేష్, జోహార్ ఎన్టీఆర్" అంటూ ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ నినదించారు.కార్యకర్తల నినాదాలతో గొల్లపూడి వన్ సెంటర్ పరిసరాలు మారుమోగాయి.అన్న ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిస్తూ కార్యక్రమం ముగిసింది.గొల్లపూడిలో రెండేళ్లలో పాలనలో పేదల సంక్షేమం కోసం అమలు చేసిన తల్లికి వందనం, పింఛన్లు, అన్నదాత సుఖీభవ, వాహనమిత్ర పథకాలకు 41.39 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.గొల్లపూడిలో 4.53 కోట్లతో సిమెంట్ కాంక్రీటు డ్రెయిన్లు నిర్మించామన్నారు. 22.91 లక్షలతో రక్షిత నీటి సరఫరా పైపులైన్లు నిర్మించామన్నారు. 15.92 కోట్లతో జల జీవన్ పనులు చేపట్టామన్నారు. పంచాయతీ రాజ్ నిధులు 7.47 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం విజయవంతం

- జిల్లా కార్యవర్గ సభ్యులుఏనుగు గాంధీ



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా బోనకల్ మండలం పరిధిలో గల బ్రాహ్మణపల్లి గ్రామంలో పార్టీ సభ్యత్వాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఏనుగు గాంధీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం బడుగు బలహీన వర్గాలు అయినన కార్మిక, కర్షక వర్గాలను దేశంలో ఉన్న అన్ని వెనకబడిన వర్గాలు అన్నిటిని కూడా మోసం చేస్తూ ప్రకటనలకే పరిమితం అవుతూ పరిపాలన కాలం ఎల్లబుచ్చుతున్నారు అని తెలిపారు. ఒకవైపు ఆర్థికమాంద్యం , పేదలపై మరింత భారం పడే విధంగా గ్యాస్, డీజిల్, పెట్రోల్ నిత్యావసర వస్తువు ధరలు నిరంతరం పెంచుకుంటూ జిఎస్టి ల పేరుతో ప్రజల సొమ్మును దోచుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఒకవైపు, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కూడా పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. కేవలం ఆర్టీసీ ఉచిత బస్సు తప్ప ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేని ప్రభుత్వంగా ప్రజా ప్రభుత్వం ప్రజల నుండి వ్యతిరేకత మూటగట్టుకుంది అని చెప్పారు. రెండున్నర సంవత్సరం కాలవ్యవధిలో 6 గ్యారంటీలు అమలు చేయలేక చేతులు పైకెత్తింది.

ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండో కూడా ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేస్తూ ఒకవైపు విద్యార్థినీ, విద్యార్థులు పోస్ట్ గ్రాడ్రేటు పూర్తిచేసుకుని ఉద్యోగం కోసం నోటిఫికేషన్లు విడుదల కాక నిరుద్యోగం పెరుగుతూ నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక నిరంతరం పెరుగుతూ చెడు వ్యసనాల వైపు ఆకర్షితులవుతూ గంజాయి స్మార్టింగ్ మత్తు పదార్థాలకు బానిసలు అవుతూ రాష్ట్రంలో దొంగతనాలు ఆడపిల్లలపై దాడులు, లా అండ్ ఆర్డర్ పూర్తిగా వైఫల్యం చెందాయి అని తెలిపారు.

ప్రతి పౌరుడు బాధ్యతగా దేశంలో జరుగు తున్నటువంటి రుగ్మతలను ఎప్పటికప్పుడు నిరంతరం అధ్యయనం చేస్తూ ప్రభుత్వాల పనితీరును ప్రజల వద్దకు చేర్చే విధంగా భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అందరూ కూడా సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి యంగల ఆనంద్రావు , బ్రాహ్మణపల్లి శాఖ కార్యదర్శి గుడిదె కృష్ణ,సహాయ కార్యదర్శి చావా గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ ఏలూరి రమేష్, మాజి ఎంపిటిసి కొంగర రామారావు, సిపిఐ సభ్యులు మదుపల్లి వెంకటేశ్వర్లు, మందడపు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## యాడికిలో అంబరాన్నంటిన మహానాడు సంబరాలు

బైక్ ర్యాలీ, రక్తదానం, అన్నదాన కార్యక్రమాలతో హోరెత్తిన మండల కేంద్రం




యాడికి మే 28 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: మండల కేంద్రంలో రెండవ రోజు మహానాడు వేడుకలు అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు మండల వ్యాప్తంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ వేడుకల సందర్భంగా ఉదయం గుత్తి రోడ్డులోని లక్ష్మీ ప్రియా థియేటర్ వద్ద నుంచి మెయిన్ బజార్ వరకు తమ్ముళ్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పసుపు జెండాల రెపరెపలు, ఎన్టీఆర్ అమరహే అనే నినాదాలతో యాడికి పురవీధులు మార్మోగాయి. అనంతరం మెయిన్ బజార్‌లోని స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు చేసిన సేవలను వారు స్మరించుకున్నారు.అనంతరం మహానాడు రెండవ రోజు వేడుకలతో పాటు నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని లక్ష్మీప్రియ థియేటర్ ఆవరణలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సామాజిక సేవా కార్యక్రమానికి రక్తదాతల నుంచి అనూహ్య స్పందన లభించింది. యువత, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేశారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన ప్రధాన మహానాడు సభా ప్రాంగణంలో నాయకులు, కార్యకర్తలు డిజిటల్ స్క్రీన్ల ద్వారా వర్చువల్ విధానంలో సాగిన అధినేత ప్రసంగాన్ని, ప్రధాన ప్రోగ్రామ్‌ను ఆసక్తిగా వీక్షించారు. మధ్యాహ్నం వేళ కార్యక్రమానికి విచ్చేసిన వందలాది మంది నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాడికి మండల తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఐక్యతతో ఈ రెండవ రోజు మహానాడు మహోత్సవం అత్యంత విజయవంతంగా ముగిసింది...



## విశాఖలో వరుస ఏసీబీ దాడులు!మాజీ స్పెషల్ ఆఫీసర్ అరెస్ట్!

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏపీలో సంచలనం చోటుచేసుకుంది..!



( నేటి శుభోదయ : 28 ) విశాఖపట్నం జిల్లా ఏపీ భవన్ మాజీ ప్రత్యేక అధికారి విశాఖపట్నంలో అవినీతి నిరోధక శాఖ ( ఏసీబీ ) అధికారుల చేతిలో అరెస్టైనట్లు సమాచారం. ప్రాథమిక దర్యాప్తులో ఆయన, కుటుంబ సభ్యులు, బినామీల పేర్లపై భారీ స్థాయిలో ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.విశాఖ తగరపువలస, పరవాడ మండలం మర్రిపాలెం, రుషికొండ వంటి ప్రాంతాల్లో పలు ప్లాట్లు, ఫ్లాట్లు ఉన్నట్లు వెల్లడైంది. అలాగే షేర్ మార్కెట్ పెట్టుబడులు, వాహనాలు కూడా ఉన్నాయని దర్యాప్తులో తేలినట్లు సమాచారం. మొత్తం సుమారు 2.76 కోట్లకు పైగా ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నారు.



## అపస్మారక స్థితిలోకి వెళ్లి వ్యక్తి మృతి

# గుర్తుతెలియని మృతుడి వివరాలు లభ్యం



(యాడికి మే 28 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: స్థానిక వెంగమనాయుని కాలనీ ఆర్చి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల ద్వారా గుర్తుతెలియని వ్యక్తి వివరాలు లభ్యమయ్యాయి. మృతుడు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం గోర్విమానుపల్లి గ్రామానికి చెందిన బూర్గుల మదన సుధాకర్ (34)గా గుర్తించారు. అతని తండ్రి పేరు మద్దిలేటి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మదన సుధాకర్ భార్య స్వగ్రామం కమలపాడు. ఈ క్రమంలో భార్య వద్దకు వచ్చేందుకు బయలుదేరిన సుధాకర్, మార్గమధ్యంలో అతిగా మద్యం సేవించాడు.అనంతరం కమలపాడు వెళ్లే దారిలో వెంగమనాయుని కాలనీ వద్ద ఉన్న ఆర్చి సమీపంలోని బండపై కూర్చున్నాడు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో ఒక్కసారిగా కిందపడిపోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అతను బండపై కూర్చుని కిందపడిపోవడాన్ని సమీపంలో ఉన్న కాలనీవాసులు కూడా గమనించినట్లు సమాచారం. కాగా, మృతుని మరణం పూర్తిగా సహజ మరణమేనని స్థానికులు, బంధువులు , పోలీసులు ప్రాథమికంగా ధృవీకరించారు...

# అలరించిన సంగీత విభావరి



ఒంగోలు, నేటి శుభోదయ ::: విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు పద్మశ్రీ నందమూరి తారకరామారావు, గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యము, దర్శకరత్న దాసరి నారాయణరావు పుట్టినరోజులు సందర్భముగా సి వి న్ రైజింగ్ రాక్స్ వారి ఆధ్వర్యంలో సుస్వరాల సుమధుర రాగమాలిక పేరుతో స్థానిక సి వి న్ రీడింగ్ రూమ్, క్లబ్ ప్రాంగణములో సంగీత విభావరి నిర్వహించారు. అద్భుతంగా గాయనీ గాయకులు పాడిన సినీ పాటలు శ్రోతలను ఆనంద డోలికల్లో తెలియాడించినవి. కార్యక్రమంలో దీప ప్రజ్వలనను డా. చల్లా నాగేశ్వరమ్మ వెలిగించి, ఎన్టీఆర్ బాలు చిత్రపటాలకు పూలమాలను సమర్పించి సంగీత విభావరిని ప్రారంభించారు. చందు, విజయ్, మధు, బుచ్చిబాబు, కొండారెడ్డి, పి, హరిబాబు, రామస్వామి, రవి, చాందిని, శైలజ, చంద్రశేఖర్, విజయ, మహాలక్ష్మి డా చల్లా నాగేశ్వరమ్మ లు గీతాలను ఆలపించారు. యాంకర్ గా గుర్రం కృష్ణ వ్యవహరించారు.




## భవిష్యత్ నాయకుడు నారా లోకేష్ దిశానిరదేశాలను సమర్ధవంతంగా అమలుచేసున్నారు

- ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు, మే 28 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) మహానాడు కార్యక్రమాల ద్వారా క్లస్టర్ స్థాయిలో పార్టీ మరింత పటిష్టంగా ఎదగాలని, భవిష్యత్ నాయకుడు నారా లోకేష్ దిశానిర్ధాశాలనుసమర్ధవంతంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గురువారం పెనమలూరు నియోజకవర్గ పరిధిలో క్లస్టర్--6 ఇంచార్జ్ మారుపూడి ధనకోటేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్చువల్ మహానాడు సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు.మహానాడు క్లస్టర్ నెంబర్ 6 లో పెనమలూరు మండలంలో సీనియర్ కార్యకర్తలకు సన్మానం కార్యక్రమం పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్, బోడె వెంకటరామ్ చేశారు.మహానాడు కార్యక్రమాల ద్వారా క్లస్టర్ స్థాయిలో పార్టీ మరింత పటిష్టంగా ఎదగాలని, భవిష్యత్ నాయకుడు మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దిశానిర్దేశాలను సమర్థవంతంగా అమలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకత్వంపై ఎమ్మెల్యే అభినందనలు వ్యక్తం చేశారు."కార్యకర్తే పార్టీకి అసలైన బలం" అనే భావనతో, మహానాడు కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి క్లస్టర్ ఇంచార్జ్, ముఖ్య నాయకుడు, కార్యకర్తకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి మరింత బలంగా చేరేలా ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ 6 ఇన్చార్జి మారుపూడి ధన కోటేశ్వరావు క్లస్టర్ పరిశీలకులు నీరుకొండ శేషు కుమారి, బోడె హేమ చౌదరి, కోయ ఆనందప్రసాద్, సంగేపు రంగారావు, పీత గోపీచంద్,అబ్దుల్ సలాం, కొమ్మినేని శ్రీనివాసరావ, మాబు సుభాని,ఇర్ఫాన్ పాషా,కలపాల శ్రీధర్, తోటకూర ఉదయ్ భాస్కర్, పందుల రజిని పాల్గొన్నారు

## విజయవాడ పార్లమెంట్ పరిధిలో అత్యంత వైభవోపేతంగా వర్చువల్ మహానాడు

రెండు రోజులు ఏడు నియోజకవర్గాలు 32 క్లస్టర్స్



విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- విజయవాడ పార్లమెంట్ లోని ఏడు నియోజకవర్గాల్లో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని విస్తృతంగా రెండు రోజులు పర్యటించారు రెండు రోజుల మహానాడు కార్యక్రమంలో ఏకంగా 32 క్లస్టర్ ఏర్పాటు చేసిన వర్చువల్ మహానాడు లో పాల్గొని ఆయన ప్రసంగించారు ముందుగా మైలవరం నియోజకవర్గం గొల్లపూడి వన్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు అనంతరం పలు నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన వర్చువల్ మహానాడులో ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు అనంతరం పలు నియోజకవర్గాల్లో సీఎం సహాయనిది చెక్కులు పంపిణీ కార్యక్రమం చేసారు.ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాల కోసం ఏర్పాటు చేసిందని అన్నారు మహానాడు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అత్యంత వైభవోపేతంగా జరిగిందని ఎక్కడ చూసినా పసుపు కండువాలతో ప్రాంతాలన్నీ కళకళలాడాయని ఆయన అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు యువనేత మంత్రి నారా లోకేష్ సారథ్యంలో పార్టీ అన్ని విధాల దినదినభివృద్ధి చెందుతుందని ఎంపీ తెలిపారు. నందిగామ నియోజకవర్గంలో ఎంపీ చిన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నియోజకవర్గ పరిశీలకులు, క్లస్టర్లు టిడిపి నాయకులు కార్యకర్తలు అందరితో కలిసి వర్చువల్ మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా కోటి సభ్యత్వాలు కలిగిన టిడిపి పార్టీ రాబోయే రోజుల్లో ప్రతి ఒక్క కార్యకర్తకి తగినటువంటి పదవి ఇచ్చి గౌరవించుకుంటుందని తెలిపారు ప్రాంతీయ పార్టీలన్నిటిలో తెలుగుదేశం పార్టీ మాత్రమే ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా కార్యకర్తల అండతో ముందుకు కొనసాగిందని రాష్ట్రవ్యాప్తంగా టిడిపి పార్టీకి ఉన్న బలం కేడర్ మాత్రమేనని ఎంపీ అన్నారు జగ్గయ్యపేట నియోజకవర్గం లోని పెనుగంచిప్రోలు గరుడాచలం ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వర్చువల్ మహానాడు కార్యక్రమంలో ఎంపీ చిన్ని ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎన్టీఆర్ 103 వ జయంతి సందర్భంగా మహానాడు ఇంత అత్యంత వైభవంగా జరగడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు కార్యకర్తలందరూ క్రమశిక్షణతో మహానాడు కార్యక్రమంలో పాల్గొనడంతో ఎంపీ చిన్ని కార్యకర్తలు ఉత్సాహాన్ని ఆయన చరవాణిలో సెల్ఫీ వీడియో, ఫోటోలు తీసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం సుపరిపాలన వైపు అడుగులు వేస్తుందని నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం శరవేగంగా జరుగుతుందని అన్నారు అటు పార్టీలోనూ కేడర్కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలుగుదేశం పార్టీకి నాయకులు ఎంత మంది వచ్చినా శాశ్వతంగా ఉండేది కార్యకర్తలేనని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు.తిరువూరు నియోజకవర్గం లోని ఊటుకూరు తోటమూల గంపలగూడెం తిరువూరు టౌన్ గోపాలపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమాల్లో ఎంపీ చిన్ని ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా తిరువూరు నియోజకవర్గం తనకు చాలా ప్రత్యేకమైన నియోజకవర్గం తన రాజకీయ ప్రచారం ప్రారంభించింది మొదటిగా తిరువూరు ప్రాంతం నుండే అని అన్నారు తిరువూరు నియోజకవర్గ టిడిపి నాయకులు కేడర్ని తాను ఎన్నటికీ మరువలేనని తన విజయంలో వారి పాత్ర మరువలేనిదని ఎంపీ ఎమ్మెల్యే ఇద్దరు విజయాలను తిరువూరు కేడర్ పనిచేసిన తీరు అద్భుతం అని అన్నారు నాయకులు ఉన్నా లేకున్నా మొట్టమొదటి నుంచి పార్టీకి అండగా నిలిచింది టిడిపి కార్యకర్తలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు ప్రజాప్రతినిధులకు చెబుతూనే ఉంటారని అన్నారు రెండు రోజుల పసుపు పండుగను విజయవాడ పార్లమెంట్ పరిధిలో లోని ఏడు నియోజకవర్గాల్లో విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఎంపీ చిన్ని పేరుపేరునా ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు

## అమ్మ ప్రేమ ఆదరణ సేవా సంస్థకు రూ. 50,000 విలువ చేసే మెడికల్ వస్తువులను అందజేసిన విజయవాడ మానవత శాఖ



విజయవాడ, మే 28 (నేటి శుభోదయ):- మానవత విజయవాడ శాఖ వారి కుటుంబ సభ్యులు తోట నాగేశ్వరావు, శ్రీమతి తోట శారద 50,000/- రూపాయలు విలువ చేసే మెడికల్ బెడ్, ఐరన్ బీరువా లను అమ్మ ప్రేమ ఆదరణ సేవా సంస్థ వృద్ధుల ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీమతి కొవ్వాడ అన్నపూర్ణమ్మ కు అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మానవత విజయవాడ శాఖ అధ్యక్షులు పగిడిపల్లి రాము దాతలకు తమ హృదయపూర్వక కృతజ్ఞతలను విజయవాడ మానవత శాఖ తరపున తెలియజేశారు. గతంలో కూడా పలు వృద్ధాశ్రమాలకు, వికలాంగులకు, నిరు పేదలకు, ఆర్థిక సహాయాన్ని, నిత్యావసర వస్తువులను, కాలేజీ ఫీజులను, స్కూల్ ఫీజులను తమ సంస్థ కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో అందజేశామని తెలిపారు. భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమాలను చేపడతామని రాము అన్నారు. ఈ కార్యక్రమంలో మానవత విజయవాడ శాఖ ప్రధాన కార్యదర్శి దావులూరి సాంబశివరావు, ఈసీ మెంబర్ సుంకర సుభాష్ చంద్రబోస్, కోశాధికారి రంగు వెంకటదుర్గా ప్రసాద్, మొదలైన వారు పాల్గొన్నారు.

## తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేసిన స్వర్గీయ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు సూర్యచంద్రులు ఉన్నంతవరకు తెలుగు ప్రజలు జరుపుకుంటారు. !!

- బిజెపి రాజానగరం నియోజకవర్గ మాజీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి..




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు పుట్టినరోజు వేడుకలు సూర్యచంద్రులు ఉన్నంతవరకు తెలుగు ప్రజలు జరుపుకుంటారని, అదేవిధంగా ఈరోజు ఎన్టీఆర్ 103వ జన్మదినోత్సవాన్ని వాడవాడలా అంగరంగ వైభవంగా జరుపుకోవడం హర్షనీయమని బిజెపి రాజానగరం నియోజకవర్గ మాజీ కన్వీనర్, సీనియర్ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి.. పేర్కొన్నారు. గురువారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో క్లస్టర్ ఇన్చార్జ్ అడపా వీరబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని వీరన్న చౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడి...



నేటి శుభోదయ
తెలుగు దినపత్రిక
శుక్రవారం - 29 -మే - 2026

# రోజూ గంటల తరబడి కంప్యూటర్ కీబోర్డుపై టైప్ చేస్తున్నారా.. అయితే ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే..



డిజిటల్ యుగంలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు లేకుండా రోజువారీ జీవితం ఊహించలేని స్థితికి చేరుకుంది. ఉద్యోగులు, విద్యార్థులు, గేమర్లు, కంటెంట్ క్రియేటర్లు ఇలా చాలా మంది రోజులో గంటల తరబడి టైపింగ్, స్క్రోలింగ్, క్లికింగ్ చేస్తూ గడుపుతున్నారు. బయటికి చూస్తే డెస్క్ పని శారీరకంగా కష్టమైన పని కాకపోయినా, చేతులు, మణికట్టుపై పడే నిరంతర ఒత్తిడి కాలక్రమేణా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యువతలో ఈ సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని చెబుతున్నారు. నిరంతరం టైపింగ్ చేయడం, మౌస్ ఉపయోగించడం వల్ల రోజుకు వేల సంఖ్యలో చిన్నచిన్న కదలికలు చేతులు, మణికట్టు, వేళ్లపై ప్రభావం చూపుతాయి. పరిశోధనల ప్రకారం కంప్యూటర్‌ను ఎక్కువసేపు ఉపయోగించే వారు గంటకు 18 వేలకుపైగా కీ స్ట్రోక్స్ చేస్తుంటారు. ఈ పునరావృత కదలికలు కండరాలు, టెండన్లు, నరాలపై అధిక ఒత్తిడిని కలిగిస్తాయి. ముఖ్యంగా మణికట్టును వంచి పనిచేయడం లేదా సరైన సపోర్ట్ లేకుండా టైపింగ్ చేయడం వల్ల సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

## ఎలాంటి సమస్యలు వస్తాయి..

డెస్క్ పనికి సంబంధించిన సాధారణ సమస్యల్లో కార్పల్ టన్నెల్ సిండ్రోమ్, టెండనైటిస్, ట్రిగ్గర్ ఫింగర్, టెన్నిస్ ఎల్బో, మణికట్టు నొప్పులు, బొటనవేలి ఒత్తిడి గాయాలు, నరాల ఒత్తిడి సమస్యలు ఉన్నాయి. ఇవి మొదట చిన్న అసౌకర్యంలా ప్రారంభమైనా, నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక నొప్పులకు దారితీస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యలకు కొన్ని ప్రారంభ సంకేతాలు కూడా ఉంటాయి. వేళ్లలో చిమ్మటలు లేదా మొద్దుబారిన భావన, మణికట్టు నొప్పి, బొటనవేలి అసౌకర్యం, వస్తువులను గట్టిగా పట్టుకోలేకపోవడం, ముందరిచేయిలో మంట, వేళ్లు క్లిక్ అవడం లేదా లాక్ అవడం, టైపింగ్ సమయంలో నొప్పి, రాత్రిళ్లు చేతులు మొద్దుబారడం వంటి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త అవసరమని సూచిస్తున్నారు. సమస్యను తొందరగా గుర్తిస్తే శాశ్వత నష్టం తప్పించుకోవచ్చు. కానీ లక్షణాలు ఉన్నప్పటికీ అదే విధంగా పని కొనసాగిస్తే పరిస్థితి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా కార్పల్ టన్నెల్ సింద్రోమ్ వంటి నరాల ఒత్తిడి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చేతి బలహీనత, కండరాల క్షీణత, పట్టుదల తగ్గడం, వేళ్ల సమన్వయం కోల్పోవడం వంటి దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

## ఎర్గోనామిక్ డివైస్‌లను వాడాలి..

ఇప్పటి వరకు ఈ సమస్యలు ఎక్కువగా వయసు పైబడిన ఉద్యోగుల్లో కనిపించేవి. కానీ ఇప్పుడు యువతలో కూడా వేగంగా పెరుగుతున్నాయి. గంటల తరబడి ల్యాప్‌టాప్ వినియోగం, మొబైల్ స్క్రోలింగ్, వీడియో గేమ్స్, సరైన ఫర్నిచర్ లేకుండా వర్క్ ఫ్రం హోమ్, శారీరక చలనం తగ్గడం వంటివి దీనికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ఈ సమస్యలను నివారించడంలో సరైన ఎర్గోనామిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. టైపింగ్ సమయంలో మణికట్టును నేరుగా ఉంచడం, కీబోర్డ్, మౌస్‌ను మోచేతి స్థాయిలో ఉంచడం, చేతులకు సపోర్ట్ ఇచ్చే కుర్చీలను ఉపయోగించడం, స్క్రీన్‌ను కళ్ల స్థాయిలో ఉంచడం, నిటారుగా కూర్చోవడం వంటి అలవాట్లు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అవసరమైతే ఎర్గోనామిక్ కీబోర్డులు, ప్రత్యేక మౌస్ పరికరాలు ఉపయోగించడం కూడా ఉపయోగకరమని చెబుతున్నారు. పని మధ్యలో విరామాలు తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. గంటల తరబడి నిరంతర టైపింగ్ వల్ల కండరాలు, టెండన్లు విశ్రాంతి పొందలేవు. ప్రతి 45 నుంచి 60 నిమిషాలకు చిన్న విరామం తీసుకోవడం, వేళ్లు, మణికట్టుకు స్ట్రెచింగ్ చేయడం, మెడ, భుజాలను కదలించడం, టైపింగ్ సమయంలో అధిక ఒత్తిడి పెట్టకుండా ఉండడం వల్ల సమస్యలను తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త..

చేతుల బలహీనత, నిరంతర నొప్పి, నిద్రలో కూడా చేతులు మొద్దుబారడం, విశ్రాంతి తీసుకున్నా సమస్య తగ్గకపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. అవసరమైతే నర్వ్ స్టడీస్, స్కాన్లు చేసి సమస్య తీవ్రతను గుర్తిస్తారు. చికిత్సలో ఫిజియోథెరపీ, మణికట్టు సపోర్ట్, మందులు, జీవనశైలి మార్పులు, తీవ్రమైన పరిస్థితుల్లో శస్త్రచికిత్స కూడా అవసరమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. డెస్క్ పని బయటికి తేలికగా కనిపించినా, దీర్ఘకాలంలో చేతులు, మణికట్టు ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుంది. అయితే సరైన భంగిమ, క్రమం తప్పని విరామాలు, వ్యాయామం, సమయానికి వైద్య సలహా తీసుకోవడం ద్వారా ఈ సమస్యలను చాలా వరకు నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# డెల్‌కు ట్రంప్ భారీ డీల్.. బిలియన్ డాలర్ల కాంట్రాక్ట్



డెల్ సంస్థకు పెంటగాన్ నుంచి భారీ కాంట్రాక్ట్ దక్కింది. డొనాల్డ్ ట్రంప్‌కు అనుబంధంగా ఉన్న ఖాతాలకు భారీ విరాళం ప్రకటించిన కొన్ని నెలలకే, అమెరికా రక్షణ శాఖ నుంచి డెల్ టెక్నాలజీస్‌కు బహుళ బిలియన్ డాలర్ల ఒప్పందం రావడం అమెరికా వ్యాపార, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ మైఖేల్ డెల్, ఆయన భార్య సుసాన్ డెల్ గతేడాది పిల్లల భవిష్యత్తు కోసం రూపొందించిన "ట్రంప్ అకౌంట్స్" కార్యక్రమానికి 6.5 బిలియన్ డాలర్ల నిధిని ప్రకటించారు. ఇప్పుడు అదే డెల్ సంస్థకు పెంటగాన్ నుంచి 9.7 బిలియన్ డాలర్ల విలువైన భారీ కాంట్రాక్ట్ దక్కడం గమనార్హం. అమెరికా మీడియా సంస్థ సీఎన్‌బీసీ కథనం ప్రకారం, "డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ అగ్రిమెంట్-××" కింద ఐదేళ్లపాటు ఈ ఒప్పందం అమల్లో ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా డెల్ ఫెడరల్ సిస్టమ్స్ అమెరికా రక్షణ శాఖకు మైక్రోసాఫ్ట్ 365 సేవలు, క్లౌడ్ సబ్‌స్క్రిప్షన్లు, ఆన్-ప్రెమైజ్ లైసెన్సింగ్ సొల్యూషన్లు అందించనుంది. ఈ ఒప్పందం పూర్తిగా పోటీ ప్రక్రియ ద్వారానే కుదిరిందని అమెరికా రక్షణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. రక్షణ శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కిర్‌స్టన్ డేవిస్, యాక్టింగ్ నేవీ సీఐఓ బారీ టానర్ మాట్లాడుతూ, ధరలు, సేవల సామర్థ్యం, మొత్తం వ్యాల్యూ చెయిన్ వంటి అంశాలపై సమగ్రంగా పరిశీలించిన తర్వాతే డెల్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా పెంటగాన్, ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ, అమెరికా కోస్ట్ గార్డ్ వంటి విభాగాల్లో సాఫ్ట్‌వేర్ లైసెన్సింగ్‌ను ఏకీకృతం చేయనున్నట్లు సమాచారం. దీని వల్ల అమెరికా ప్రభుత్వానికి ప్రతి ఏడాది సుమారు 422 మిలియన్ డాలర్ల వరకు ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2027 ఆర్థిక సంవత్సరానికి 1.5 ట్రిలియన్ డాలర్ల భారీ బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న సమయంలో ఐటీ ఖర్చులను క్రమబద్ధీకరించడంలో ఈ ఒప్పందం కీలకమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మైఖేల్ డెల్ దంపతుల విరాళం కూడా మరోసారి వార్తల్లోకి వచ్చింది. "ఒక చిన్న ఆర్థిక ప్రోత్సాహం పిల్లల జీవితాన్ని ఎంతగా మార్చగలదో మేము చూశాం. వారి అవకాశాల ప్రపంచం విస్తరిస్తుంది" అని విరాళం ప్రకటించినప్పుడు మైఖేల్ డెల్ వ్యాఖ్యానించారు. ఇదే తమ జీవితంలో అతిపెద్ద దాతృత్వ కార్యక్రమమని కూడా ఆయన పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇటీవల ఓ కార్యక్రమంలో మైఖేల్ డెల్‌ను ప్రశంసిస్తూ డెల్ ఉత్పత్తులు కొనాలంటూ ?ప్రజలకు పిలుపునివ్వడం గమనార్హం. 2024 ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన తర్వాత ఆయనకు అభినందనలు తెలిపిన మైఖేల్ డెల్.. సైన్స్ అండ్ టెక్నాలజీ సలహా మండలిలో చేరినట్లు సమాచారం. దాతృత్వ కార్యక్రమాల్లో కూడా డెల్ కుటుంబం చురుకుగా వ్యవహరిస్తోంది. ఇటీవలే టెక్సాస్ విశ్వవిద్యాలయం, ఆస్టిన్‌కు మైఖేల్ డెల్ 750 మిలియన్ డాలర్ల విరాళం ప్రకటించారు. ఈ నిధులతో కృత్రిమ మేధస్సు ఆధారిత వైద్య పరిశోధన కేంద్రం, ఆధునిక వైద్య ప్రాంగణం నిర్మించనున్నారు.

# ఉద్యోగాలపై ఏఐ ప్రభావం.. యువతకు పిచాయ్ సందేశం!

కృత్రిమ మేధస్సు గురించి ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా యువతలో.. విద్యార్థుల్లో ఏఐ తమ ఉద్యోగాలపై ప్రభావం చూపుతుందేమో అనే భయం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. ఇటీవల 'హార్డ్ ఫోర్క్' అనే పాడ్‌కాస్ట్‌లో సుందర్ పిచాయ్ మాట్లాడుతూ.. యువతపై తనకు ఎంతో నమ్మకం ఉందని తెలిపారు. ఏఐ వల్ల మార్పులు వచ్చినా, కొత్త తరం ఆ సవాళ్లను స్వీకరించి మంచి భవిష్యత్తును నిర్మిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో జరగబోయే పట్టభద్రుల సభలో పిచాయ్ ప్రసంగించబోతున్నారు. ఈ సందర్భంగా.. పాడ్‌కాస్ట్ హోస్ట్ ఏఐ గురించి మాట్లాడితే.. విద్యార్థులు విమర్శిస్తే, ఏమని జవాబిస్తారు? అని సరదాగా ప్రశ్నించారు. 'ప్రతి తరం సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగింది. ఈ తరం కూడా అలాగే సవాళ్లను అధిగమించి మంచి ప్రపంచాన్ని నిర్మిస్తుంది' అని పిచాయ్ సమాధానం ఇచ్చారు. యువత, విద్యార్థులు ఏఐ ప్రభావాన్ని మాత్రమే అనుభవించరు. భవిష్యత్తులో ఏఐ అభివృద్ధిని ముందుకు నడిపించే ప్రధాన శక్తిగా కూడా మారతారు. వీళ్ళే ఏఐ పురోగతికి కారణమవుతారు, దాని ప్రభావాలను కూడా ఎదుర్కొంటారని పిచాయ్ వెల్లడించారు. యువత కొత్త అవకాశాలను సృష్టించే శక్తి కలిగిన వారని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల చాలా కంపెనీలు.. ఉద్యోగులను తొలగించడానికి ప్రధాన కారణం ఏఐ అని చెబుతున్నారు. దీనివల్ల ఉద్యోగాల భద్రతపై మరింత ఆందోళన పెరిగింది. ముఖ్యంగా కొత్తగా చదువు పూర్తి చేసిన యువతలో నిరుద్యోగం కూడా పెరుగుతోందని నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఏఐ గురించి భయపడటం సహజమని పిచాయ్ అంగీకరించారు. టెక్నాలజీలో వచ్చే మార్పులు ఎప్పుడూ సమాజంలో భయాన్ని కలిగిస్తాయి. గతంలో వచ్చిన సాధారణ సాంకేతిక మార్పులకు కూడా ప్రజలు భయపడ్డారు.




కానీ.. తరువాత అవే అభివృద్ధికి దోహదపడ్డాయని ఆయన గుర్తుచేశారు. ఏఐ ను కూడా సరైన విధంగా ఉపయోగిస్తే మానవ సమాజానికి ఉపయోగకరంగా మారుతుందని చెప్పారు. ఏఐ వల్ల జరిగే నష్టాలను మాత్రమే కాకుండా.. ప్రయోజనాలను కూడా ప్రజలకు స్పష్టంగా చూపించాల్సిన బాధ్యత టెక్నాలజీ రంగంపై ఉందని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. పరిశ్రమలు, కంపెనీలు, ప్రభుత్వాలు కలిసి బాధ్యతాయుతంగా ఏఐ ని అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని పెంచేందుకు ఇంకా చాలా పని చేయాల్సి ఉందని ఆయన అంగీకరించారు.

# గడ్కరీ కీలక ప్రకటన.. వచ్చేస్తోంది కొత్త రకం స్టవ్!



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ.. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కంటే వంటను చౌకగా చేయగల, కొత్త ఇథనాల్ ఆధారిత స్టవ్ టెక్నాలజీని ఆవిష్కరించారు. ఇది భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న బయోఫ్యూయల్ మిషన్‌లో మరో ప్రధాన ముందడుగును సూచిస్తుంది. నాగ్‌పూర్‌లో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ.. ఇథనాల్ ఆధారిత కొత్త స్టవ్ ద్వారా, వంట గ్యాస్ సిలిండర్ల కంటే తక్కువ ఖర్చుతోనే వంట చేయవచ్చని తెలిపారు. ఇది దేశీయంగా అభివృద్ధి చేసిన సాంకేతికతగా పేర్కొన్నారు. ఇథనాల్‌ను నీటితో కలిపి మంటను ఉత్పత్తి చేయడం ద్వారా ఈ స్టవ్ పనిచేస్తుంది. ఇది సంప్రదాయ ఎల్‌పీజీ వంటి ఇంధనాల కంటే తక్కువ కాలుష్యాన్ని కలిగిస్తుంది. కాబట్టి గృహ వినియోగానికి ఇది ఒక ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంది. భారతదేశం చమురు అవసరాల కోసం.. సుమారు 87 శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. ఈ పరిస్థితిని తగ్గించేందుకు ప్రభుత్వం ఇథనాల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని పెంచుతోంది. ఇప్పటికే దేశంలో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం కలిపి వినియోగించడం కొనసాగుతోంది. 2014లో 1.5 శాతం నుంచి 2025 నాటికి దాదాపు 20 శాతానికి ఇథనాల్ వినియోగం పెరిగింది. ఇథనాల్ అనేది ప్రధానంగా.. చెరకు, మొక్కజొన్న, వ్యవసాయ వ్యర్థాల నుంచి ఉత్పత్తి అవుతుంది. కాబట్టి ఇది మండినప్పుడు కూడా తక్కువ కాలుష్యం విడుదలవుతుంది. అందువల్ల దీనిని పర్యావరణహిత ఇంధనంగానే పరిగణిస్తారు. ఈ కొత్త టెక్నాలజీ విజయవంతమైతే.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వంట గ్యాస్‌పై ఆధారపడటం చాలావరకు తగ్గుతుంది. ఇదే జరిగితే.. ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉంది. అయితే దీనికోసం భారీ మొత్తంలో ఇథనాల్ ఉత్పత్తి అవసరం అవుతుంది. సరఫరా మాత్రమే కాకుండా.. భద్రత కూడా చాలా ముఖ్యం. ఇవన్నీ సాధ్యమైతేనే ప్రజలు దీనిని విశ్వసిస్తారు. వినియోగించడానికి ముందుకు వస్తారు.

# కోట్ల వ్యయం.. అందని ప్రతిఫలం!




గత కొంతకాలంగా ప్రపంచ టెక్ రంగాన్ని శాసిస్తున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మాయాజాలం ఇప్పుడు ఒక క్లిష్టమైన దశకు చేరుకుంది. అల్లాద్దీన్ అద్భుత దీపంలా వ్యాపార సామర్థ్యాన్ని పెంచి, ఖర్చులను తగ్గించేస్తుందని నమ్మిన బిగ్ టెక్ కంపెనీలకు ఇప్పుడు 'రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్' (ఆర్ఓఐ) లేదా 'పెట్టుబడిపై రాబడి' రూపంలో అసలు సవాలు ఎదురవుతోంది. ఏఐ మౌలిక సదుపాయాల కోసం మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా వంటి దిగ్గజాలు సమష్టిగా 2025లో సుమారు 320 బిలియన్ డాలర్లు ఖర్చు చేశాయని అంచనా. అయితే, ఈ భారీ వ్యయానికి తగ్గ ప్రతిఫలం వస్తోందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామం ఐటీ ఉద్యోగులకు ఒక రకంగా ఊరటనిచ్చే విషయమేనని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎందుకంటే, ఏఐ వాడకం పెరుగుతుందనే నెపంతో ఇప్పటివరకు టెక్ కంపెనీలు లేఆఫ్స్ (ఉద్యోగాల కోత)పై తీవ్రంగా ఫోకస్ చేశాయి. కానీ ఇప్పుడు ఏఐ మితిమీరిన ఖర్చులకు బ్రేకులు పడుతుండడంతో మున్ముందు లేఆఫ్స్ భయాలు తగ్గే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

## ఉబెర్‌లో ఇలా..

ప్రముఖ రైడ్-హెయిలింగ్ సంస్థ ఉబెర్‌లో ప్రస్తుతం జరుగుతున్న అంతర్గత పరిణామాలు ఏఐ బడ్జెట్ సంక్షోభానికి అద్దం పడుతున్నాయి. ఉబెర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) ఆండ్రూ మెక్ డొనాల్డ్ ఇటీవల తమ ఏఐ వ్యయాలను సమర్థించుకోవడం కష్టంగా మారుతోందని బహిరంగంగానే అంగీకరించారు. ఉబెర్ ఎగ్జిక్యూటివ్‌లు అంతర్గతంగా ఈ సమస్యను 'టోకెన్ మాక్సింగ్'గా పిలుస్తున్నారు. డెవలపర్లు భారీ మొత్తంలో ఏఐ కంప్యూట్ టోకెన్లను వినియోగిస్తున్నప్పటికీ ఆ ఖర్చంతా యూజర్లకు మెరుగైన ప్రొడక్ట్స్‌గా మారుతోందా లేదా అని ట్రాక్ చేయడానికి ఎలాంటి నమ్మదగిన మార్గం లేకపోవడమే దీనికి కారణం. ఉబెర్ సీటీఓ ప్రవీణ్ నెప్పల్లి నాగ వెల్లడించిన వివరాల ప్రకారం.. క్లాడ్ కోడ్ కోసం కంపెనీ కేటాయించిన మొత్తం 2026 బడ్జెట్ కేవలం నాలుగు నెలల్లోనే పూర్తయింది. అయితే, ఉబెర్ ఉద్యోగులు ఏఐ టూల్స్‌ను చాలా మెరుగ్గా స్వీకరించారు. కంపెనీలోని 5,000 మందికి పైగా డెవలపర్లలో 92% కంటే ఎక్కువ మంది ప్రతి నెలా ఏఐ అసిస్టెంట్లను వాడుతున్నారు. ప్రస్తుతం ఉబెర్ రాసే కోడ్‌లో 10% ఏఐ సృష్టించిందే. అయినప్పటికీ, ఏఐ జనరేట్ చేసిన కోడ్ వల్ల కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ మెరుగవుతోందా అంటే లీడర్‌షిప్ దగ్గర సమాధానం లేదు. ఉత్పాదకత పెరిగిందని చెబుతున్నా దానివల్ల కొత్తగా ఏ ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తయ్యాయనే దానికి, ఖర్చుకు లింక్ దొరకడం లేదు.

## వ్యూహం మార్చుకుంటున్న మైక్రోసాఫ్ట్, డ్యుయోలింగో

కేవలం ఉబెర్ మాత్రమే కాదు, ఏఐ రంగంలో అగ్రగామిగా ఉన్న మైక్రోసాఫ్ట్ సైతం ఇప్పుడు అప్రమత్తమైంది. భారీ ఏఐ విస్తరణల వల్ల పెరుగుతున్న వ్యయాన్ని నియంత్రించడానికి మైక్రోసాఫ్ట్.. ఆంత్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ కోడ్‌తో సహా కొన్ని బాహ్య ఏఐ కోడింగ్ సబ్‌స్క్రిప్షన్లను తగ్గించడం ప్రారంభించినట్లు సమాచారం. మరోవైపు, లాంగ్వేజ్-లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ 'డుయోలింగో' గతంలో ఉద్యోగుల పనితీరును ఏఐ వినియోగ మెట్రిక్స్‌తో లింక్ చేస్తూ తెచ్చిన అంతర్గత విధానాన్ని వెనక్కి తీసుకుంది. ఏఐ సాధనాలు తమ పని నాణ్యతను పెంచకపోయినా కేవలం టార్గెట్ల కోసం వాటిని వాడాల్సి వస్తోందని సిబ్బంది ఫిర్యాదు చేయడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది.

## కంపెనీలు చేస్తున్న ప్రాథమిక తప్పిదం ఏంటి?

ప్రముఖ ఏఐ అధ్యాపకుడు అన్ష్ మెహ్రా విశ్లేషణ ప్రకారం.. చాలా కంపెనీలు ఏఐ అమలులో ప్రాథమిక తప్పు చేస్తున్నాయి. ఉద్యోగులు స్వయంగా ఆలోచించి పనిని నిర్మించుకోవడానికి ముందే పూర్తిగా ఏఐ వ్యవస్థలపై ఆధారపడుతున్నారు. దీనివల్ల వచ్చే అవుట్‌పుట్‌ను సరిచేయడానికి, డీబగ్ చేయడానికి మళ్లీ మానవ శ్రమ భారీగా అవసరమవుతోంది. ఫలితంగా.. సామర్థ్యం పెరగకుండానే కేవలం 'టోకెన్ ఖర్చులు' మాత్రమే కొండలా పేరుకుపోతున్నాయి.

## ఏఐ స్వీకరణకు సరైన మార్గం (అన్ష్ మెహ్రా సూచనలు)

తక్కువ రిస్క్ ఉండే రొటీన్ పనుల్లో మాత్రమే నిర్దిష్ట దశలను ఏఐతో ఆడిట్ చేయాలి. ఆయా విభాగాల్లోని అత్యంత అనుభవజ్ఞులైన వ్యక్తులతో మాత్రమే ఎల్ఎల్ఎమ్‌లను పరీక్షించి అవుట్‌పుట్‌లను ధ్రువీకరించాలి. ఉద్యోగులందరికీ ఏఐ లైసెన్సులు ఇచ్చేసే కంటే ముందు ఏది పని చేస్తుంది, ఏది పని చేయదు అనేది స్పష్టంగా డాక్యుమెంట్ చేయాలి.

## పెరగనున్న భరోసా!

గతంలో ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహి మాట్లాడుతూ.. ఏఐ పెట్టుబడుల వైపు వనరులను మళ్లించడం కోసం నియామకాలను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. కానీ, ప్రస్తుత ఆర్థిక సమీక్షలు చూస్తుంటే ఈ వ్యూహం ఎంతవరకు లాభదాయకమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టెక్ కంపెనీలు ఏఐ వైపు అనాలోచితంగా పరుగెత్తి, ఉద్యోగులను తగ్గించుకుంటూ పోవడం ఒక తాత్కాలిక ట్రెండ్ మాత్రమేనని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఏఐ వల్ల ఆశించిన స్థాయిలో ఆర్ఓఐ రాకపోవడం, పైగా కంప్యూటింగ్ బడ్జెట్లు గుల్లవుతుండడంతో కంపెనీలు తిరిగి క్షేత్రస్థాయి వాస్తవాల్లోకి వస్తున్నాయనే వాదనలున్నాయి. ఫలితంగా, ఉద్యోగుల స్థానాన్ని ఏఐ భర్తీ చేస్తుందనే భయాలు తగ్గి, లేఆఫ్స్ వేగం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .